V3 NEWS
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
14-08-2024
సంపుటి : 01 | సంచిక :102 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
CMD

## కాగ్నిజెంట్ విస్తరణకు శ్రీకారం

- హైదరాబాద్‌లో నేడు కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి
- 15 వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం
- అధునాతన సాంకేతికతపై కొత్త క్యాంపస్ ఫోకస్




## రాష్ట్రంలో మేఘా కమిషన్ల సర్కారు

రాష్ట్రంలో మేఘా కమిషన్ల సర్కారు
సీఎం కాకముందు ఆరోపించారు..
ఇప్పుడు పనులు కట్టబెడుతున్నారు..
మేఘా కంపెనీ నాసిరకం పనులు చేస్తుంది
సుంకిశాల ప్రాజెక్టును పరిశీలించిన బీజేపీ ఎమ్మెల్యేల ఆరోపణ






### ప్రాజెక్టుల పేరు మార్చి..
# నాలుగింతలు ఖర్చు చేశారు

- నీటిపారుదల శాఖను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాం
- నాటి రాజీవ్,ఇందిరా సాగర్ ప్రాజెక్టే.. నేటి సీతారామ సాగర్ ప్రాజెక్ట్
- రూ.7,436 కోట్లు ఖర్చు చేసి.. ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు
- 90 శాతం పూర్తి అయ్యిందని పేర్కొనడం హాస్యాస్పదం
- మాజీ మంత్రి హరీశ్ రావు పై మంత్రులు ఉత్తమ్,పొంగులేటి ఫైర్

**విశ్వంభర, హైదరాబాద్**
రాష్ట్రంలో నీటిపారుదల శాఖను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి.. నామమాత్రంగా ఆయకట్టుకు సాగునీరు ఇచ్చిందని విమర్శించారు. ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టు 3 పంపులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. 2026 ఆగస్టు 15 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక నీటి పారుదల శాఖకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టు 3 పంపులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జలసౌధలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటితో కలిసి పాల్గొన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు.

మిగతా2లో...

### ఏసీబీ వలలో రంగారెడ్డి
## అదనపు కలెక్టర్


- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- వ్యక్తి నుంచి రూ. 8 లక్షల లంచం డిమాండ్




## లోపలి పేజీల్లో ముఖ్య వార్తలు

వినేశ్ రజతంపై ఉత్కంఠ..
తీర్పు మళ్లీ వాయిదా..
గురుకులాలను ప్రక్షాళన చేస్తాం
నిధులు సమకూరుస్తాం:
డిప్యూటి సీఎం భట్టీ
మరింత స్ట్రాంగ్ గా హైడ్రా
ఎన్నికల్లో ఓడిపోతే
దేశాన్ని వదిలి వెళ్లిపోతా: ట్రంప్
కేసీఆర్ కు బిగ్ షాక్ ఇచ్చేందుకు
రేవంత్ ప్లాన్
త్వరలో మంత్రివర్గ విస్తరణ?
ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు
మరో జత యూనిఫాంలు

### స్వాంతంత్ర్య వేడుకలకు లఖ్‌పతి, డ్రోన్ దీదీలు
## ప్రత్యేక అతిథులు




## టీజీ డీఎస్సీ పరీక్షల ప్రాథమిక ‘కీ’ విడుదల

**విశ్వంభర, హైదరాబాద్** : టీజీ డీఎస్సీ పరీక్షల ప్రాథమిక కీ విడుదలైంది. స్కూల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్‌లో కీలు, రెస్పాన్స్‌షీట్‌స్‌ను అందుబాటులో ఉంచినట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా అభ్యంతరాలు తెలపాలని అధికారులు సూచించారు. డీఎస్సీ పరీక్షలను ఈ ఏడాది జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించిన సంగతి తెలిసిందే. డీఎస్సీ ప్రాథమిక కీ కోసం https://tgdsc.aptonline.in/tgdsc అనే వెబ్‌సైట్ లింక్‌ను క్లిక్ చేయండి.

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి


## కేజీవాల్, కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడగింపు



**ఢిల్లీ:** మద్యం విధానం కేసులో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవాల్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు పొడిగించింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయి ప్రస్తుతం తిహాడ్ జైలులో ఉంటున్న ఈ నేతలిద్దరి కస్టడీని సెప్టెంబర్ 2వరకు పొడిగించింది. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో వీరిని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఎదుట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు.

### నాబిడ్డల ప్రాణ త్యాగాలకు
## ఫలితం దక్కింది

సుప్రీంకోర్టు తీర్పు ద్వారా మాదిగ జాతి గెలిచింది
: మందకృష్ణ మాదిగ




## అదానీపై ఢిల్లీలో పోరాటం.. తెలంగాణలో రెడ్ కార్పెట్..

- జాతీయ కాంగ్రెస్‌కు ఒక నీతి..? రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మరో నీతా..?
- అదానీ-సెబీ ఆరోపణలపై జేపీసీ వేయాలని డిమాండ్
- సీఎం రేవంత్ చీకటి ఒప్పందాల్ని తెలంగాణ సమాజం నిశితంగా పరిశీలిస్తోంది
- ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీని ప్రశ్నించిన కేటీఆర్






## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 82 | ₹ 104 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 151 | ₹ 172 |

## సెప్టెంబరు రెండో వారంలోగా భూసేకరణ పూర్తి చేయాలి

భూములు కోల్పోతున్న రైతులకు చట్టపరమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పురోగతిపై కలెక్టర్లతో సీఎస్ సమీక్ష




## ఇస్రో శాస్త్రవేత్తలు నిజమైన హీరోలు

శ్రీహరికోట సందర్శన చిన్ననాటి కల
రాకెట్ ప్రయోగాలు చేసే శాస్త్రవేత్తలు కనిపించని దేవుళ్లు
బాలీవుడ్ సినిమాకు అయ్యే ఖర్చుకంటే తక్కువతో రాకెట్ ప్రయోగాలు
జాతీయ అంతరిక్ష ఉత్సవాల్లో పాల్గొన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**విశ్వంభర, శ్రీహరికోట:** బాలీవుడ్ సినిమాకు అయ్యే ఖర్చుకంటే తక్కువతో రాకెట్ ప్రయోగాలు చేస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు నిజమైన హీరోలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్లో జరిగిన జాతీయ అంతరిక్ష ఉత్సవాల్లో పవన్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. షార్ డైరెక్టర్ రాజరాజన్ చంద్రయాన్3 రాకెట్ ప్రయోగ నమూనాను పవన్కు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాకెట్ ప్రయోగాలు చేసే శాస్త్రవేత్తలు కనిపించని దేవుళ్లుగా అభివర్ణించారు. శాస్త్రవేత్తలను.. యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. శాస్త్రవేత్తలకు భారత ప్రధాని నరేంద్రమోదీ అండగా ఉండటంతో ప్రయోగాలు విజయవంతం అవుతున్నాయన్నారు. శ్రీహరికోట సందర్శనతో తన చిన్ననాటి కల నెరవేరిందని పవన్ చెప్పారు. అనంతరం అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పవన్ బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు.

# రాష్ట్రంలో మేఘా కమిషన్ల సర్కారు



**విశ్వంభర, సుంకిశాల:** ఆగస్టు 2న సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిన ఘటన తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై పెద్ద రాజకీయ దుమారమే రేగుతోంది. అయితే తాజాగా ఘటన జరిగిన సుంకిశాల ప్రాంతాన్ని బీజేపీ ఎమ్మెల్యేల బృందం సందర్శించింది. ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాల్వాయి హరీశ్ బాబు, రామారావు పటేల్, ఎమ్మెల్సీ ఎ.వి.ఎన్. రెడ్డి సహా స్థానిక బీజేపీ నాయకులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. బీజేపీ ఎమ్మెల్యేల బృందం కూలిన పంప్ హౌస్ రిటైనింగ్ వాల్‌ను పరిశీలించింది. కూలిపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుంది. సుంకిశాల ఘటన జరిగి 12 రోజులు అవుతున్నా ప్రభుత్వం ఎందుకు గోప్యంగా ఉంచిందని బీజేపీ శాసన సభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌ను కాపాడుకోవడం కోసమేనా అని ప్రశ్నించారు. అధికారుల అనుమతి లేకుండా కాంట్రాక్టర్ టన్నెల్ ఓపెన్ చేశారని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారన్నారని అన్నారు .అతి చిన్న నష్టం జరిగిందని మంత్రులు చెబుతున్నారని, ఎలాంటి నివేదిక రాకుండానే అలా ఎలా చెప్పగలరన్నారు. షిఫ్ట్ బంద్ కావడం వల్ల వందలాది ప్రాణాలు కాపాడుకోగలిగామన్నారు. లేకపోతే వందలాది మంది ప్రాణాలు కోల్పోయేవారని వాపోయారు. మేఘా కంపెనీ నాసిరకం పనులు చేస్తుందని ముఖ్యమంత్రి కాకముందు రేవంత్ రెడ్డి అనేకసార్లు ఆరోపించి, ఇప్పుడు ఆ కంపెనీకే ప్రాజెక్టులు కట్టబెట్టుతున్నారని విమర్శించారు.రాష్ట్రంలో మేఘా కమిషన్ల సర్కారు నడుస్తోందన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఈ గోడ కూలిపోయిందని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆరోపించారు. కాంట్రాక్టర్ లైసెన్స్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని కాంట్రాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుంకిశాల గోడ కూలిన ఘటనపై ప్రభుత్వం గోప్యత వహిస్తోందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ మండిపడ్డారు. ఎవ్వరూ చనిపోలేదని చెబుతున్నా తమకు అనేక అనుమానాలు కల్గుతున్నాయన్నారు. ప్రభుత్వంతో కాంట్రాక్టర్కు లోపాయికారీ ఒప్పందం ఉందని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే సీబీఐ విచారణకు అదేశించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల్లో నాసిరకం పనులు చేస్తే దీనికి ఎవ్వరూ బాధ్యత వహించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్. రెడ్డి ప్రశ్నించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రాజెక్టుల పేరు మార్చి.. నాలుగింతలు ఖర్చు చేశారు

(మొదటి పేజీ తరువాయి)

రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వలేదు..

గత ప్రభుత్వ హయాంలో రూ.1.81 లక్షల కోట్లతో నామమాత్రంగా ఆయకట్టుకు సాగునీరు ఇచ్చారన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వలేదని మండిపడ్డారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికీ నీళ్లు ఇవ్వలేదని ఆక్షేపించారు. సీతారామ ప్రాజెక్టుకు రూ.7,436 కోట్లు ఖర్చు చేసి, ఒక్క ఎకరానికీ నీళ్లు ఇవ్వలేదని దుయ్యబట్టారు.

పదేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేదు..

బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నా, పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేదని ఉత్తమ్ విమర్శించారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ పెండింగ్ పనులు పూర్తి చేయలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో నీటి పారుదల శాఖకు అధిక నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు.

కమీషన్ల కోసం ప్రాజెక్టును పక్కనపెట్టారు..

వైఎస్ఆర్ హయాంలో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టు చేపట్టారని మంత్రి గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల కక్కుర్తి కోసం ప్రాజెక్టును పక్కనపెట్టారని మండిపడ్డారు. ప్రాజెక్టు పూర్తి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి పేరు వస్తుందని రీడిజైన్ చేశారని ఆరోపించారు. ప్రాజెక్టు పేర్లు మార్చి రీడిజైన్ చేసి ఖర్చు నాలుగింతలు చేశారన్నారు. రెండు ప్రాజెక్టులను రూ.3,505 కోట్లతో పూర్తి చేయవచ్చని, కానీ వాటి వ్యయాన్ని గత ప్రభుత్వం రూ.18,286 కోట్లు చేసిందన్నారు.

ప్రాజెక్టుల పేరు మార్చి.. ఖర్చు నాలుగింతలు చేశారు..

కాళేశ్వరం మాదిరిగానే రాజీవ్, ఇందిరాసాగర్ వ్యయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాలుగింతలు చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొంత భూభాగం ఏపీకి వెళ్లిందని ఆరోపించారు. రాజీవ్‌సాగర్ ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు ఖర్చు చేస్తే 4 లక్షల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి వచ్చేదన్నారు. రాజీవ్, ఇందిరాసాగర్ ప్రాజెక్టుల వ్యయం రూ.19 వేల కోట్లకు చేరిందన్నారు.

90 శాతం పూర్తి అయ్యిందని పేర్కొనడం హాస్యాస్పదం..

సీతారామ ప్రాజెక్టు 90 శాతం పూర్తిచేశామని బీఆర్ఎస్ నాయకులు చెప్పడం హాస్యాస్పదమన్నారు ఉత్తమ్‌కుమార్ రెడ్డి. ఆ ప్రాజెక్టుకు రూ.19 వేల కోట్లలో రూ.7436 కోట్లు ఖర్చు చేశారన్నారు. గత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు పనులు 39 శాతం చేపట్టిందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాల కోసం ప్రాజెక్టు చేపట్టామని, ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి సాధించినట్లు అబద్ధాలు ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ప్రాజెక్టుకు ఇప్పటికీ సీడబ్ల్యూసీ అనుమతి రాలేదని వెల్లడించారు.

## కాగ్నిజెంట్ విస్తరణకు శ్రీకారం




**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ లో ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ తమ కొత్త క్యాంపస్‌ను బుధవారం శంకుస్థాపన చేయనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అమెరికా పర్యటనలో భాగంగా కాగ్నిజెంట్ కంపెనీ సీఈవో రవికుమార్ తో చర్చలు జరిపారు. న్యూజెర్సీలో ఈనెల 5వ తేదీన రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందానికి అనుగుణంగా కాగ్నిజెంట్ కంపెనీ పది రోజుల్లోనే కొత్త క్యాంపస్ విస్తరణకు శ్రీకారం చుట్టింది. ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ముందుగానే వెల్లడించింది. హైదరాబాద్ లో 10 లక్షల చదనపు అడుగుల కొత్త క్యాంపస్ నెలకొల్పుతామని, అదనంగా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త క్యాంపస్ ఫోకస్ చేస్తుంది.


అమెరికా, దక్షిణ కొరియా పర్యటన ముగించుకొని బుధవారం ఉదయం ముఖ్యమంత్రి హైదరాబాద్ చేరుకొని.. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి కాగ్నిజెంట్ కంపెనీ శంకుస్థాపనలో పాల్గొంటారు. కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ కూడా హాజరవుతారు. 1994లో చెన్నై కేంద్రంగా ఆవిర్భవించిన కాగ్నిజెంట్ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. హైదరాబాద్లో 2002 నుంచి కార్యకలాపాలు ప్రారంభించింది. ఐటీ కారిడార్లో లోని వివిధ ప్రాంతాల్లో ఐదు క్యాంపస్లు ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్లో దాదాపు 57 వేల మంది ఉద్యోగులున్నారు. రాష్ట్రంలో ఐటీ రంగంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రెండో సంస్థగా కాగ్నిజెంట్ కు పేరుంది. గడిచిన రెండేండ్లలో ఈ కంపెనీ రాష్ట్రంలోని 34 వివిధ విద్యాసంస్థల నుంచి 7500 మంది ఫ్రెషర్లకు ఉద్యోగాలు ఇచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో కాగ్నిజెంట్ కంపెనీ తెలంగాణ నుంచి రూ. 7725 కోట్ల ఐటీ ఎగుమతులను నమోదు చేసింది. గడిచిన అయిదేండ్లలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద ఈ కంపెనీ రూ. 22.5 కోట్లతో వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టింది.

## సెప్టెంబరు రెండో వారంలోగా భూసేకరణ పూర్తి చేయాలి

**విశ్వంభర, హైదరాబాద్:** రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం సెప్టెంబరు రెండో వారంలోగా భూ సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారులు శ్రీనివాస్ రాజు, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవిన్ మిట్టల్, అటవీ శాఖ అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, ఆర్అండ్‌బిశాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు రాష్ట్రంలో అత్యధిక ప్రాముఖ్యత సంతరించుకున్నదని, ఈ ప్రాజెక్ట్ సంబంధించి వివిధ దశలలో పెండింగ్ లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. భూసేరణ నష్ట పరిహారానికి సంబంధించిన అంశంపై ప్రత్యేక దృష్టి సారించి భూములు కోల్పోతున్న రైతులకు న్యాయ పరమైన నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం అందేవిదంగా జిల్లా స్థాయి లో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేసి, భూముల మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కోర్టు కేసుల పై కూడా ప్రత్యేక చొరవ తీసుకుని త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.

## స్వాంతంత్ర్య వేడుకలకు లఖ్‌పతి, డ్రోన్ దీదీలు ప్రత్యేక అతిథులు

- నేడు వారి కోసం ప్రత్యేకంగా జాతీయ వర్క్ షాప్
- ప్రకటన విడుదల చేసిన పంచాయితీరాజ్ మంత్రిత్వశాఖ



**విశ్వంభర, ఢిల్లీ:** ఎర్రకోటలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 78వ స్వాతంత్ర్య వేడుకలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారిలో కొందరిని కేంద్రం ప్రత్యేక అతిథులుగా ఆహ్వానిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే పంచాయతీరాజ్ సంస్థల నుంచి దాదాపు 400 మంది మహిళా ప్రతినిధులు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నారు. ఈమేరకు పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది.

ఎర్రకోటలో జరగబోయే ఈ వేడుకల్లో పంచాయతీ రాజ్ సంస్థల నుంచి దాదాపు 400 మంది మహిళా ప్రతినిధులను ఆహ్వానించినట్లు తెలిపింది. ఇందులో భాగంగా 45 మంది లఖ్‌పతి దీదీలు, 30 మంది డ్రోన్ దీదీలు హాజరుకానున్నారు.

ఈ వేడుకలకు హాజరయ్యే వారి కోసం బుధవారం ప్రత్యేకంగా జాతీయ వర్క్ షాపును నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్, నవజ్యోతి ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కిరణ్ బేడీతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొనున్నారు.

స్వయం సహాయక సంఘ (ఎస్‌హెచ్‌ఎ) కింద మహిళలకు వివిధ రకాల నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి.. వారు ఏడాదికి కనీసం రూ. లక్ష స్థిర ఆదాయం పొందడమే లఖ్‌పతి దీదీ పథకం. ఎస్ హెచ్‌జీల్లోని మహిళలకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇవ్వడమే డ్రోన్ దీదీ పథకం.

## నాబిడ్డల ప్రాణ త్యాగాలకు ఫలితం దక్కింది

- సుప్రీంకోర్టు తీర్పు ద్వారా మాదిగ జాతి గెలిచింది : మందకృష్ణ మాదిగ
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బషీర్ బాగ్ చౌరస్తా వరకు
- ర్యాలీ నిర్వహించిన ఎంఆర్పీఎస్ కార్యకర్తలు

**విశ్వంభర, హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలకంటే మన శ్రమ గొప్పది కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం తెలబండ్ల రవి మొట్టమొదట ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. బిడ్డల ప్రాణ త్యాగాలకు ఇవాళ ఫలితం దక్కిందన్నారు. ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం మందకృష్ణ మాదిగ మొదటిసారి ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి క్లాక్ టవర్, ప్యాట్నీ, బైబిల్ హౌజ్, ట్యాంక్ బండ్ మీదుగా బషీర్ బాగ్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. క్లాక్ టవర్ వద్ద భారీ గజమాలతో మందకృష్ణ మాదిగను సత్కరించారు. ఎమ్మార్పీఎస్ శ్రేణులు దారిపొడవునా టపాసులు కాల్చుతూ.. మిఠాయిలు పంచుకున్నారు.

జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభలో మందకృష్ణ మాట్లాడారు. "ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారాలు రాష్ట్రానికే ఉన్నాయని, వాటిని అమలు చేయాలని చెప్పి సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపి సహకరించిన మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు. 30 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో మా న్యాయమైన పోరాటానికి మీడియా మద్దతిచ్చింది. జాతీయ అంశమైన ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేశాం. సుప్రీంకోర్టు ద్వారా మాదిగ జాతి గెలిచిందని స్పష్టంగా అర్థమైంది" అని మందకృష్ణ అన్నారు.

## సంగారెడ్డిలో రాజీవ్ జ్యోతి యాత్ర

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో భారీగా వాహన ర్యాలీ

**విశ్వంభర, సంగారెడ్డి:** ప్రపంచ శాంతి కోరుకొని ఈ దేశం కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయులు రాజీవ్ గాంధీ అని, ఆయనను ఈ దేశం ఎన్నటికీ మరచిపోదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు రాజీవ్ జ్యోతి మంగళవారం సాయంత్రం సంగారెడ్డికి చేరుకున్న సందర్భంగా ఘన స్వాగతం పలికారు టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు జిల్లా నాయకులు తౌబాజ్ కిషన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజీవ్ జ్యోతి నిర్వాహకులు దొరై శ్రీనివాసప్ప తదితరులు భారీ వాహనశ్రేణితో సంగారెడ్డికి వచ్చిన సందర్భంగా జ్యోతికి సాదర స్వాగతం పలికి సంగారెడ్డి పట్టణంలో పెద్ద ఎత్తున కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రపంచంలోనే అత్యంత నిబద్ధత ప్రజాసేవ కలిగిన నాయకుడని అన్నారు ప్రపంచ శాంతి కోసం శ్రీలంకలో శాంతి దళాలను ఏర్పాటు చేసి తన శాంతి సహనాన్ని చాటుకున్న గొప్ప నాయకులని అన్నారు యువత రాజకీయాలకు రావడం వల్ల ప్రజలకు దేశానికి మేలు కలుగుతుందని భావించిన రాజీవ్ గాంధీ 18 సంవత్సరాలకే ఓటు హక్కు తీసుకువచ్చి రాజకీయాల్లో పెను మార్పులకు శ్రీకారం చుట్టారని అన్నారు.



ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మాట్లాడుకుంటున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సాంకేతిక పరిజ్ఞానాన్ని రాజీవ్ గాంధీ దేశంలో అభివృద్ధి చేశారని, నేడు ప్రపంచంలో ఎక్కువ మంది ఐటీ నిపుణులు ఉంటున్నారంటే అది రాజీవ్ గాంధీ చలవే అన్నారు.రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నిధులు లేని ఉండకూడదని భావించి పంచాయతీరాజ్ చట్టం చేసి చేసి పంచాయతీలకు నేరుగా నిధులు అందించాలని వివరించారు.

రాజీవ్ జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు దొరై బృందాన్ని ఆయన అభినందించారు ఆగస్టు 20వ తేదీ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా తమిళనాడు నుండి దిల్లీ వరకు రాజీవ్ జ్యోతి యాత్ర సాగుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈరోజు తమిళనాడు నుంచి తెలంగాణ మీదుగా దిల్లీకి బయలుదేరిన రాజీవ్ గాంధీ అమరజ్యోతి యాత్రకు సంగారెడ్డి నియోజకవర్గం వద్ద టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో స్వాగతం పలికారు.

## అదానీపై ఢిల్లీలో పోరాటం.. తెలంగాణలో రెడ్ కార్పెట్..

**విశ్వంభర, హైదరాబాద్ :** హిండెన్ బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ సెబీ ఆరోపణలపై దేశవ్యాప్త ఆందోళనకు పిలుపులిచ్చిన కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం అదే అదానీ కంపెనీకి రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలకడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం కాదా.? అని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా సూటిగా ప్రశ్నించారు. అదానీపై జాతీయ కాంగ్రెస్‌కు ఒక నీతి..? రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు మరో నీతా..? అని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు.

ఒక వైపు మీరేమో... అదానీ సెబీ ఆరోపణలపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిస్తున్నారు. కానీ ఇక్కడ మీ కాంగ్రెస్ ముఖ్యమంత్రేమో.. అదానీకి స్వయంగా రెడ్ కార్పెట్ పరుస్తున్నారు.. అదానీ కంపెనీకి ద్వారాలు తెరుస్తున్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఏకంగా అదానీకే అప్పగిస్తున్నారు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

అదానీ వల్ల దేశానికి నష్టం అన్నప్పుడు.. మరి తెలంగాణ రాష్ట్రానికి మాత్రం లాభమెలా అవుతుందో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో.. అదానీ కంపెనీల ఆగమనాన్ని రాహుల్ గాంధీకి ఆపగలరా..? కాంగ్రెస్ సీఎం నిర్వాకాన్ని నిలదీసే ధైర్యం చేయగలరా..? అదానీ పెట్టుబడులకు ఫుల్ స్టాప్ పెట్టగలరా..? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొట్టికాయలు వేయగలరా..? అంత శక్తి రాహుల్ గాంధీకి ఉన్నదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

కాంగ్రెస్ రెండు నాల్కల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందనీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందాల్ని కూడా నిశితంగా పరిశీలిస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అధికారమిచ్చిన పాపానికి.. తెలంగాణను అదానీకి అప్పగించాలని చూస్తే సహించమని, రాష్ట్ర భవిష్యత్తును అంధకారం చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమని స్పష్టంచేశారు. తెలంగాణ హక్కుల కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టే పార్టీ బీఆర్ఎస్ అనే విషయాన్ని ఎప్పటికీ గుర్తు పెట్టాకోవాలన్నారు .

## ఏసీబీ వలలో రంగారెడ్డి అదనపు కలెక్టర్

**విశ్వంభర, హైదరాబాద్:** ఉన్నత హోదాలో కొనసాగుతూ ఆదర్శంగా ఉండాల్సిన కొందరు ప్రభుత్వ అధికారులు అడ్డదారులు తొక్కుతున్నారు. లంచం తీసుకోవటం నేరమని తెలిసినా.. డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నాచితక ఉద్యోగులే కాదు..పై స్థాయి ఉద్యోగులు సైతం లంచాలకు మరుగుతున్నారు. తాజాగా.. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం కలకలం రేపుతోంది. గత రాత్రి 11 గంటల సమయంలో ఓ వ్యక్తి నుంచి రూ.8 లక్షల లంచం తీసుకుంటూ అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు సమీపంలో డబ్బులు కారులో పెట్టుకుంటుండగా.. ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. వివరాల్లోకి వెళితే.. జక్కిడి ముత్యంరెడ్డి అనే వ్యక్తి తనకున్న 14 గుంటల భూమిని ధరణి పోర్టల్లో నిషేధిత జాబితా నుంచి దరఖాస్తు పెట్టుకున్నాడు. అయితే అందుకు సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్ రెడ్డి రూ. 8 లక్షలు డిమాండ్ చేశాడు. దీంతో ముత్యంరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముత్యంరెడ్డి నుంచి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలవేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

అయితే అడ్డంగా దొరికిపోయిన మదన్.. జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డి పేరు తెరపైకి తీసుకొచ్చాడు. జాయింట్ కలెక్టర్ చెబితేనే తాను డబ్బులు తీసుకున్నట్లు ఏసీబీకి చెప్పాడు. దాంతో తమ ముందే ఏసీబీ అధికారులు జాయింట్ కలెక్టర్‌కు ఫోన్ చేయించారు.. మదన్ మోహన్ జాయింట్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తాను ముత్యం రెడ్డి డబ్బులు తీసుకున్నట్లు చెప్పాడు. దీంతో ఆ డబ్బును తీసుకొని పెద్ద అంబర్ పేట్ ఔటర్ రింగ్ రోడ్డు వద్దకు జాయింట్ కలెక్టర్ ఫోన్‌లో మదన్ మోహన్‌కు సూచించాడు.

అప్పటికే అక్కడ కాపు కాసిన ఏసీబీ అధికారులు పెద్ద అంబర్‌పేట వద్ద జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డికి మదన్ మోహన్ డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మరోవైపు నాగోల్లోని జేసీ భూపాల్రెడ్డి నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు చేపట్టారు. ఇంటిలో రూ.16లక్షల నగదు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏసీబీ నుంచి తప్పించుకోలేరు:సీవీ ఆనంద్..

లంచం తీసుకునే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏసీబీ నుంచి తప్పించుకోలేరని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ అన్నారు. జాయింట్ కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వీరిని పట్టుకోవడానికి ఏసీబీ బృందం సోమవారం రాత్రి ఎంతో చాకచక్యంగా పని చేసిందని కొనియాడారు.

## తెలంగాణకు మూడురోజులు వర్ష సూచన

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో రాగల మూడురోజుల పాటు తేలికపాటి మోస్తరు వర్షాపాతం కురిసే నమోదయ్యే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం నాటి ద్రోణి రాయలసీమ కొమొరిన్ ప్రాంతం వరకు విస్తరించి సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని పేర్కొంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు పలుచోట్ల ఉరుములు, మెరుపులు.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది.శుక్రవారం వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తెలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, జయశంకర్, నల్గొండ, హైదరాబాద్ జీహెచ్‌ఎంసీలో వర్షం కురిసింది. అత్యధికంగా హైదరాబాద్ నగర పరిధిలోని ఖైరతాబాద్‌లో 8.3 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది.

# వైద్య దంపతుల సేవలు ప్రశంసనీయం

- ఘనంగా లైఫ్ -హెల్త్ రీ యిన్‌ఫోర్స్ మెంట్ రజతోత్సవం




**విశ్వంభర, హైదరాబాద్ :** అందమైన జీవితం అందరికీ సొంతం కావాలనే ఉద్దేశంతో లైఫ్ హెల్త్ రీ యిన్‌ఫోర్‌స్‌మెంట్ (ఎల్ హెచ్ ఆర్ జి) స్వచ్ఛంద సంస్థను స్థాపించి పాతికేళ్లుగా డాక్టర్ వింజమూరి సూర్యప్రకాశ్, డాక్టర్ వేంకట కామేశ్వరిలు చేస్తున్న సేవ అపూర్వమని పలువురు వక్తలు కొనియాడారు. సమాజంలో మార్పు కోసం వారు ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారని, విప్లవాత్మక కార్యక్రమాలు చేపడుతున్నారని ప్రశంసించారు. ఎల్. హెచ్. ఆర్. జి. రజతోత్సవాలు మంగళవారం స్థానిక ఏవీ కాలేజి ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఉదయం యువసమ్మేళనం, సాయంత్రం పెద్దలతో సభ నిర్వహించారు. పలువురు విశిష్ట వ్యక్తులు, కవులు, రచయితలు, విశ్రాంత అధికారులు, డాక్టర్లు పాల్గొని ప్రసంగించారు. అందరి ఇల్లు, అందరి పుస్తకం, అందరి శ్వాస, జ్ఞానాన్నిపంచుకోవడం, అందరూ బాగుండాలి అనే లక్ష్యాల సాధనకు వినూత్న పంథాలో కార్యక్రమాలు రూపొందించడం అభినందనీయమని వక్తలు ప్రశంసించారు. ముఖ్యంగా ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడం, అనవసరంగా గర్భసంచి తొలగింపునకు వ్యతిరేకంగా ఉద్యమించడం, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయాన్నిఅర్థించకుండా నిరంతరం సేవా కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ప్రభుత్వాలు పాఠశాలలను పట్టించుకోవాలి



ఉదయం నిర్వహించిన యువసమ్మేళనంలో సంస్థ స్థాపకుడు డాక్టర్ వింజమూరి సూర్యప్రకాశ్‌లు ప్రసంగించారు. రజతోత్సవాల ఉద్దేశాన్నివివరించారు. ప్రభుత్వాలు పాఠశాలలను పట్టించుకోకపోవడం, విద్యార్థులు చదువుకునే మంచి వాతావరణాన్నిపాఠశాలల్లో కల్పించకపోవడం పట్ల సూర్యప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాల్సిన యవకులు రోడ్డు ప్రమాదాల్లో చనిపోవడం దారుణమన్నారు. దేశానికి ఎంతో ఉపయోగపడాల్సిన వారు నడిరోడ్లపై శవాలుగా మారే పరిస్థితి దారుణమన్నారు. ఇలాంటి మరణాలను ఆపి తీరాలన్నారు. యువకులు కూడా వాహనాలను నిబంధనల మేరకు నడపాలని,అతి వేగంగా నడపాలనుకుంటే మైదానాలను అందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. కవి, రచయిత సుధామ, ఆధ్యాత్మిక వేత్త అనంతలక్ష్మి తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్య, పర్యావరణం, వ్యవసాయం అంశాలపై ప్రఖ్యాత వ్యవసాయవేత్త శివశంకరి, పర్యావరణవేత్త భాస్కర్ రెడ్డిలు ప్రసంగించారు. వ్యవసాయం ప్రధాన ఉద్దేశం ఆదాయం కాదని.. సరైన ఆహారం అని శివశంకరి అన్నారు.

విశిష్ట వ్యక్తులకు సన్మానం

విద్యావేత్త వంగపల్లి విశ్వనాథం, ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ కైసర్ జమిల్, ప్రఖ్యాత గైనకాలజిస్ట్ డాక్టర్ బాలాంబ, కవి , రచయిత విహారి, సీహెచ్ఏఐ పూర్వ డైరెక్టర్ జాన్ వట్టమట్టన్‌లను ఈ సందర్భంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుమతి, ఎంవీ శాస్త్రి, వసంత కన్నాభిరాన్ తదితర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# మనసురాబాద్ డివిజన్లో ఎలైట్ కార్ స్పా డెటాయిలింగ్ సెంటర్ ప్రారంభం




**విశ్వంభర, వనస్థలిపురం :** మనసురాబాద్ డివిజన్లో ఎలైట్ కారు స్పా అండ్ రిటైలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాలకృష్ణ మాట్లాడుతూ.. తమ సెంటర్ ప్రత్యేకతలు కార్ ఫోమ్ వాష్, టెప్లాన్ కోటింగ్, సెరామిక్ కోటింగ్, ఇంటర్ ఇయర్ క్లీనింగ్, ఆంటీ రస్ట్ కోటింగ్, మొదలైన సదుపాయాలు ఉంటాయని తెలిపారు.

# ఎంబీబీఎస్ విద్యార్థినికి ఉప్పల్ ఎమ్మెల్యే చేయూత




**విశ్వంభర, హైదరాబాద్ :** మల్లాపూర్ డివిజన్‌కి చెందిన మచ్చ శ్రీనివాస్ కుమార్తె మచ్చ తన్మయి కామినేని అకాడమీ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఎల్బీనగర్‌లో ఎంబీబీఎస్ 3వ సంవత్సరం చదువుతున్నది. ఆ విద్యార్థి ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యుడు బండారు లక్ష్మారెడ్డి తన స్వంత నిధులతో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఫీజు 60,000/ రూపాయల చెక్కును డా.ఏఎస్‌రావ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ రాష్ట్ర పద్మశాలి అధ్యక్ష

# ఎన్నికలు నిలిపివేయాలి




**విశ్వంభర,హైద్రాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రిజిస్టర్డ్ 98/2023 ఎన్నికలు నిలిపివేయాలని గ్రేటర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కత్తుల సుదర్శన్ రావు, చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు,సామాజిక ఉద్యమ నాయకులు డా.చిక్క దేవదాస్ తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఎన్నికల కమిషనర్ భువనగిరి ఉదయ్ కుమార్ కు పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైలా రూల్ ప్రకారం ఎన్నికల నిర్వహణ జరగడం లేదని ఆరోపించారు. బైలా రూల్ నెంబర్ 10 ప్రకారము అధ్యక్షుని ఎన్నుకోవడానికి గ్రామము నుండి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి మాత్రమే ఓటు హక్కు ఉంటుందనీ తెలియజేశారు. అదే విధంగా మండల స్థాయిలో పదిమందికి ఓట్లు, మున్సిపాలిటీకి 12 ఓట్లు, జిల్లాకు 51 ఓట్లు, అనుబంధ సంఘాలకు మూడు ఓట్లు, శాశ్వత సభ్యులకు జిల్లాకు 250 మంది మించకుండా ఉండాలి, కానీ బైలాకు వ్యతిరేకంగా రాష్ట్ర మొత్తంలో 45 వేల మందికి సభ్యత్వం ఉన్న అందరికీ ఓటు హక్కు కల్పించడం బైలాకు వ్యతిరేకంగా కొందరు స్వార్ధపరులైనటువంటి వారు బైలాను ధిక్కరించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఎన్నికలు నిర్వహిస్తున్నారు అని మండి పడ్డారు. అందుకుగాను ఎన్నికల కమిషన్ ఫిర్యాదు చేయడం జరిగిందనీ తెలిపారు. హైకోర్టును కూడ ఆశ్రయించమని, స్టే ఆర్డర్ కొరకు ప్రయత్నం చేస్తున్నాం అని తెలిపారు. బైలా లో ఉన్న చట్టాల ప్రకారం మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

# తనిఖీలు ముమ్మరం చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు

జిలాల్లో హోటళ్లపై దృష్టి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్టంలో హైదరాబాద్ ప్రధాన నగరంతో పాటు తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఇటీవలే ఆహార తనిఖీ అధికారులు చేపడుతున్న తనిఖీలలో అనేక అశుభ్రకరమైన , దుర్భర పరిస్థితులు వెలుగులోకి వస్తున్నాయి . ఆహార తనిఖీ అధికారులు మొన్నటి వరకు హైదరాబాద్ లోని పలు రెస్టారెంట్లు, హోటళ్లు, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో పలు రెస్టారెంట్లు, హోటళ్లు అనేక అంశాలను గుర్తించారు. నోటీసులు కూడా ఇచ్చారు. ఇప్పుడు ఫుడ్ సెప్టీ అధికారులు జిల్లాల్లో కూడా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

మండి రెస్టారెంట్ ఏర్పాటుపై ఫిర్యాదులు అందడంతో తెలంగాణ ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆ రెస్టారెంట్‌లో తనిఖీలు చేశారు. FoSCoS యాప్‌లో నమోదైన ఫిర్యాదుల మేరకు సోదాలు చేశారు. సిద్దిపేటలోని పొన్నాల రెస్టారెంట్‌లో జరిపిన తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు పలు ఉల్లంఘనలను గుర్తించారు. వంటగది ఆవరణలో అపరిశుభ్రంగా ఉండడం, చెత్తకుండీలు లేకుండా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.వడ్డించే సిబ్బందికి చేతి గ్లౌజ్ లేవని గమనించారు. ముడి, పాక్షికంగా తయారుచేసిన ఆహార పదార్థాలను నేరుగా నేలపై ఉంచడం వల్ల కలుషితమై ప్రమాదం ఉందన్నారు. ఎఫ్ఎస్ఎస్ చట్టం, 2006 ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. మండి, ఇతర రెస్టారెంట్లతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలలు, హాస్టళ్లలో కూడా ఇటీవల దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో వంటగది సిబ్బందికి సరైన ప్రోటోకాల్‌లు, ఆహార తయారీలో అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించేలా గత కొన్ని నెలలుగా టాస్క్‌ఫోర్స్ వివిధ రెస్టారెంట్లు, పీజీలు, హాస్టళ్లపై దాడులు నిర్వహిస్తోంది.

# ఆలేటి రమేశ్‌కి శ్రీదేవి సినీ అవార్డు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రతియేటా సినీనటి శ్రీదేవి జయంతి సందర్భంగా ఇచ్చే అవార్డుకి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పీఏ ఆలేటి రమేశ్‌కి హిమాయత్ నగర్‌లో జరిగిన సభలో ప్రదానం చేశారు. ఈ సందర్భగా తనకు అవార్డ్ రావడానికి కృషి చేసిన వారందరికీ ఆలేటి రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.




# గురుకుల విద్యార్థినికి సీఎం రేవంత్ రెడ్డి అండ

- ప్రభుత్వ ఖర్చుతో నిమ్స్ లో వైద్యం
- కోలుకుంటున్న విద్యార్థిని కార్తీక



**విశ్వంభర, హైదరాబాద్:** గురుకుల పాఠశాల భవనంపై నుంచి కిందపడి తీవ్రగాయాలపాలైన విద్యార్థిని కొయ్యడ కార్తీక కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. ప్రభుత్వ ఖర్చుతో వైద్యం అందించాలని ఆయన సీఎం తన కార్యాలయ అధికారులను ఆదేశించారు. సీఎం సూచన మేరకు హైదరాబాద్ లోని నిమ్స్ లో కార్తీక కు వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం కార్తీక కోలుకుంటోంది. ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కార్తీక ఈ నెల 9న ప్రమాదవశాత్తు స్కూల్ మూడో అంతస్తు నుంచి పడిపోయింది. దీంతో విద్యార్థిని నడుం భాగంలో తీవ్రగాయాలయ్యాయి. గురుకుల అధికారులు కార్తీకను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి కి ,అక్కడి నుంచి నిమ్స్ కు తరలించారు. నిమ్స్ న్యూరో సర్జన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమల్ బృందం మంగళవారం నాడు కార్తీకకు ఆపరేషన్ నిర్వహించింది.. ప్రస్తుతం ఐసీయులో విద్యార్థిని కోలుకుంటున్నట్లు డాక్టర్లు తెలిపారు. కార్తీకకు కావాల్సిన వైద్యం ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరించనున్నది. ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తో మాట్లాడి కార్తీక కోలుకునేంత వరకు వైద్యం అందించాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా కార్తీక ఆరోగ్య పరిస్థితిపైన ఎప్పటికప్పుడు నిమ్స్ డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్నారు.



# "ప్రతిజ్ఞ" పదశిల్పి పైడిమర్రి వెంకటసుబ్బయ్య

మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్ధనా సమయంలో ఇంగ్లీష్‌లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందేమాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే.

వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్చా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు.

వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు.



ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మ చర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 194546 లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు.

1962 చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖపట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిం చేందుకు పైడిమర్రి "ప్రతిజ్ఞ"కు రూపకల్పన చేశారు. రాసిన దానిని 1963లో విశాఖపట్నం లోని ఒక పాఠశాలలో తొలిసారిగా ప్రతిజ్ఞ చేయించారు. "ప్రతిజ్ఞ"ను ప్రముఖ రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు తెన్నేటి విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లగా, సాహితీవేత్త అయిన అప్పటి విద్యాశాఖ మంత్రి, విజయ నగరం రాజాగా పేరు గాంచిన పీవీజీ రాజుకు అంద చేశారు. ఆయన నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డితో చర్చించారు. 1963లో "ప్రతిజ్ఞ" ను పాఠ్య పుస్తకాలలో చేర్చి ప్రతిరోజు ప్రార్ధనా సమయంలో చదివిం చాలని ఉత్తర్వులు జారీ చేశారు.

1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయ నిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశం జరిపి నపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించారు.

1965 తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిని ఆంగ్లంలోలో పొందుపరచి దేశవ్యాప్తంగా అమలు చేశారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలాను గుణంగా కొన్ని స్వల్ప మార్పులు జరిగి, కొన్ని గ్రాంథికం పదాల స్థానంలో వాడుక భాష వాడి, ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి తెచ్చారు.1965 జనవరి 26 నుంచి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువుతున్నారు.

పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కేసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 201516 విద్యా సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు.



- రామ కిష్టయ్య
సంగన భట్ల...
9440595494

# సామాజిక సంస్కర్త గోపరాజు లవణం

**నేడు వర్ధంతి**

లవణంగా సుపరిచితులు అయిన గోపరాజు రామచంద్ర లవణం (10 అక్టోబర్ 1930 14 ఆగష్టు 2015)... గోరా గా ప్రసిద్ధి చెందిన గోపరాజు రామచంద్ర రావుకు పెద్ద కుమారుడు. ఉప్పు సత్యాగ్రహం సాగుతున్న కాలంలో పుట్టిన ఆయనకు లవణం అని పేరు పెట్టారు. తొమ్మిది మంది సంతానం కాగా, గోరా తన కుమారులకు వారు పుట్టినప్పటి ప్రపంచ, దేశ పరిస్థితులకు అద్దం పడుతూ విలక్షణమైన పేర్లు పెట్టాడు. ఉప్పు సత్యాగ్రహం సాగుతున్న కాలంలో పుట్టిన కుమారునికి లవణం అని, భారతీయులు చట్ట సభల్లో నిలిచి గెలిచిన కాలంలో పుట్టిన కొడుక్కు విజయం: అని, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పుట్టిన కుమారులకు సమరం, నియంత అని, తొమ్మిదవ సంతానానికి నవ్ అని పేర్లు పెట్టారు. గాంధీ ఇర్విన్ ఒడంబడిక సందర్భంలో పుట్టిన అమ్మాయికి మైత్రి అని, మరో కుమార్తె పేరు మనోరమ అని పెట్టారు. లవణం తండ్రి బాటలో నడిచాడు. లవణం భారతీయ సామాజిక సంస్కర్త. గాంధేయవాది, హేతువాది. ఆయన భారతీయ సమాజంలోని అంటరానితనాన్ని తొలగించడానికి పని చేశాడు. ఆయన నాస్తికుడు. ఆయన సతీమణి హేమలత లవణంతో కలిసి సంస్కార్ సంస్థను స్థాపించారు. నాస్తికమార్గం పత్రికల సంపాదకుడుగా పని చేశారు. లవణం చిన్నతనం లోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు 1973లో విజయవాడ హేతువాద సంఘ అధ్యక్షుడిగా నియమితుడయ్యారు. అస్పృశ్యతా నిర్మూలన కుల నిర్మూలన కోసం కృషిచేశారు. నవయుగ కవి చక్రవర్తి, పద్మ విభూషణ్ గుర్రం జాషువా కుమార్తె హేమలతను మహాత్మా గాంధీ ఆశ్రమంలో వివాహం చేసుకున్నారు. గాంధేయ విలువలకు కట్టుబడి సామాజిక అభ్యున్నతికి అంకితమై పని చేశారు. మహాత్మాగాంధీ వ్యక్తిత్వం, వినోబా భావేల ప్రభావంతో, నిరాడంబరంగా ఎలా జీవించాలో వారి నుంచే నేర్చుకున్నారు.

సామాజిక జాగృతికి అనేక విధాల కృషి చేస్తున్న లవణం హేతువాదం, నాస్తిక వాదంపై అనేక గ్రంథాలు రచించారు. సంఘం, ది ఎథీస్ట్, నాస్తిక



మార్గం పత్రికలు లవణం సంపాదకీయంలో వెలువడ్డాయి. భారత నాస్తిక కేంద్రం డైరెక్టర్ గా వ్యవహరించారు. సమాజంలో వేళ్లూనుకున్న మూఢ విశ్వాసాలు, మత మౌఢ్యానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నడిపారు. హేమలత, లవణం దంపతులు గొప్ప సంఘ సంస్కర్తలు. సంస్కార్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, నిజామాబాద్ జిల్లాలో జోగిని వ్యవస్థను రూపుమాపేందుకు కంకణం కట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో ఉంటూ జిల్లాలో ఎన్నో గ్రామాలను దత్తత తీసుకుని, అనేక సంఘసేవా, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లాలో ఉన్న 'జోగినీ' దురాచార వ్యవస్థను, ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను తొలగించి, ప్రజలను చైతన్య పరచి, దురాచారాలను పూర్తిగా నిర్మూలించ గలిగారు. "ప్లాన్ ఇంటర్నేషనల్" వారి ఆర్థిక సాయంతో అనేక గ్రామాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ మార్ని రామకృష్ణారావు సలహా మేరకు అక్బర్ నగర్ గ్రామంలో గ్రామస్థుల సహాయంతో ప్రకృతి ఆశ్రమాన్ని 1997 లో ప్రారంభించడం జరిగింది. అయితే 2006 లో సంస్థతో చేసుకున్న 9 సంవత్సరాల అగ్రిమెంట్ పూర్తి అయిపోవడం వల్ల వచ్చే రోగులు ఇచ్చే ఆదాయంతో ఆశ్రమం నిర్వహించడం కష్టం అయింది. పల్లెటూరు అవడం, 5,10 మందికి మించి రోగులు రాకపోవడం వల్ల ఆశ్రమ నిర్వహణ కష్టమయింది. ఆ సమయంలో లవణం దంపతులు, మార్ని రామకృష్ణారావును కలసి మంతెన సత్యనారాయణ రాజుకు ఆ ప్రకృతి ఆశ్రమం ఉచితంగా 33 సంవత్సరాల లీజు అగ్రిమెంటుతో అప్పగించచారు అలా సంస్కార్ ప్రకృతి ఆశ్రమం అతి తక్కువ ఫీజులతో భారత దేశంలో మరెక్కడాలేనంత తక్కువ ధరలలో వైద్యసేవలందిస్తోంది. నాస్తికత్వం అభివృద్ధి చరిత్ర 1978, కోవూర్ జీవితం 1980 తదితర రచనలు చేశారు.

నేను నాస్తికుడిని, దేవుని నమ్మను. పూజించను. ఇతరులు ఎంతోమంది నమ్ముతారు. పూజిస్తారు. ఒకరి భావాలు మరొకరికి నచ్చవు. కొందరు నన్ను వ్యతిరేకిస్తారు. ఇంకొందరు ముఖం మీదనే తిడతారు. అయినా నేను వారి పట్ల ద్వేష భావం పెంచుకోను. పోట్లాటకు, వాదనలకు దిగను నేను స్వతహాగా హాస్య ప్రియుడిని, ఎప్పుడూ సరదాగా ఉండాలనుకునే మనస్తత్వం నాది అని తరుచూ చెపుతుండే వారు. 1991లో అంతర్జాతీయ నాస్తికత్వాన్ని 1980 నుండి 1990 వరకు ప్రోత్సహించి నందుకు లాస్ ఏంజిల్స్ లోని నాస్తికుల యునైటెడ్ నుండి నాస్తికుడు అవార్డు, 2009లో డీనోటిఫైడ్ తెగల సభ్యులకు పునరావాసం, ఉపాధి అవకాశాలను అందించి నందుకు జమ్నాలాల్ బజాజ్ అవార్డు, 2011లో ప్రపంచ శాంతికి, మానవత్వానికి సేవ చేసినందుకు వైష్ణవ సెంటర్ ఫర్ ఎన్లైటెన్మెంట్తో అనుబంధంగా ఉన్న ఇంటర్నేషనల్ సర్వీస్ సొసైటీ నుండి లైఫ్‌ఎమ్ అచీవ్ మెంట్ అవార్డు, 2015లో మానవ హక్కులు , సామాజిక సంస్కరణలను ప్రోత్సహించడానికి ఆయన చేసిన కృషికి హైదరాబాద్ లోని ప్రోబ్ రిసోర్స్ సెంటర్ ఫర్ జర్నలిస్ట్ నుంచి అంతర్జాతీయ హ్యూమనిస్ట్ అవార్డు తదితరాలు ఆయనకు లభించాయి. కొంత కాలం ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతూ, 2015, ఆగస్టు 14న విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

# పద్యాలలో "ఊట" బిగువు... ధారణలో సులువు

> తెలుగు సాహిత్యంలో వచనం కంటే పద్యానికే అధిక గౌరవం ఉంటుంది. శాసన భాషలో కావచ్చు, అనువాద రచనల్లో కావచ్చు, నేరుగా రాసిన రచనల్లో కావచ్చు పద్యమే కవులను, పండితులను ఎక్కువగా ఆకర్షించింది. ఆది నుండి తెలంగాణలో మార్గపద్ధతి కంటే దేశీ చంధస్సుకే అగ్రతాంబూలం ఇచ్చారు. పద్యమే తెలుగులో పురాతన ప్రక్రియ. శాసనాలలో లభించిన పండరంగని మధ్యాక్కర కూడా తెలుగు వృత్తమే. తెలుగు భాషకు ప్రాచీనహోదా దక్కడానికి పద్యమే ప్రధాన భాధ్యతను భుజానెత్తుకుంది. సంస్కృతంలో ఆదికావ్యం రామాయణం. ఇది శ్లోకాల రూపంలో ఉంటుంది. తరువాత కాలాల్లో ఈ రామాయణాన్ని మొల్ల, గోనబుద్ధారెడ్డి వంటివారు మరియు ఆధునికకాలంలో విశ్వనాధవంటి వారు తెలుగులోకి పద్యకావ్యాలుగా అనువాదం చేశారు. అయినప్పటికీ తెలుగులో మొదటి పద్య కావ్యం మహాభారతం. దీనిని కవిత్రయం అనువాదం చేశారు. ఆదికవి నన్నయ మార్గరీతిని, తిక్కన ప్రాకృతిక దేశీ రీతిని, ఎర్రాప్రగడ ప్రబంధ రీతిని అనుసరించారు. తెలంగాణలో పద్యరచన ఆదినుండి భిన్నమైనది. స్వతంత్ర్యమైనది. ఆదికవి పాల్కురికి సోమన ద్విపదలో బసవపురాణం, వృషాధిప శతకం రాశాడు. పోతన దేశీ చంధస్సులో భాగవతపురాణ అనువాదంలో భక్తిరస ప్రధానంగా సహజశైలిని అనుసరించారు.




ప్రాచీనకాలం నుండి తెలుగులో కావ్యాలు, ప్రబంధాలు వంటి పద్యరచనలు ఉన్నప్పటికీ పద్యం అనగానే శతక పద్యాలే గుర్తొస్తాయి. శతకం కూడా ప్రాచీన పద్య ప్రక్రియనే. దేశీరచననే. అయినప్పటికీ తెలుగు సాహిత్య మధ్యయుగ కాలంలో వచ్చిన వేమన, సుమతీ శతకాలు ప్రసిద్ధిపొందాయి. ఇవి ఎక్కువగా నీతి ప్రధానంగా ఉన్నాయి. సామాజిక హితాన్ని కాంక్షించాయి. శతకానికి ఖండకావ్యానికి కొన్ని బేధాలున్నాయి. శతకం సంఖ్యా నియమం, మకుట నియమం, ఛందో నియమాలకు లోబడి ముక్తకాలుగా ఉంటుంది. ఖండకావ్యానికి అలాంటి పరిమితులు ఉండవు. ఏదైనా ఒక అంశాన్ని లేదా భిన్నమైన అంశాలను తీసుకొని పద్యాలు రాయడం ఖండకావ్యం అంటారు.

ఆధునిక కాలంలో పద్యాలు ఖండ కావ్యాలుగా అనేకంగా వచ్చాయి. తెలంగాణలో కన్యాశుల్కంపై నిరసనగా బోయనపల్లి వెంకటాచార్యుడు (1869 1929) "రాజలేఖ" అనే ఖండకావ్యం రాశారు. బహుశా తెలుగులో ఇది తొలి ఖండకావ్యం కావొచ్చు. తిరుపతి వేంకట కవులను ఓడించిన "బాలసరస్వతి" తిరుమల బుక్కపట్నం శ్రీనివాసాచార్యులు తెలంగాణ పద్యకవి కావడం గమనార్హం. ముఖ్యంగా గుర్రం జాషువా, శ్రీశ్రీ, దాశరధి, కాళోజి నారాయణ రావు, డా. సి. నారాయణరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి ప్రసిద్ధులు ఖండకావ్యాలు రాశారు.

డా. లింగనబోయిన లేఖానందస్వామి రాసిన "ఊట ఖండకావ్యం" గ్రంధాన్ని పరిశీలించినప్పుడు, ఈ గ్రంథంలో 71 అధ్యాయాలలో 168 పద్యాలున్నాయి. ఇవన్నీ ఆటవెలదిలో దేశీ చంధస్సులోనే ఉన్నాయి.

"ఇనగణత్రయంబు ఇంద్ర ద్వయంబు, హంస పంచకంబు ఆటవెలది" అనేవి ఈ పద్య లక్షణాలు. ఆటవెలది పద్యాలు సులువుగా ఉండి పద్య రచనకు, ధారణకు అనుకూలంగా ఉంటుంది. ఆటవెలది అనగానే వేమన పద్యాలు గుర్తొస్తాయి. వేమన ఆటవెలదులనే ఈటలను సమాజంపైకి విసిరిన సామాజిక కవి. సార్వజనీన కవి. అర్థగాంభీర్యత, భావగాంభీర్య తలతో మూడవపాదం ఒక చెర్నాకోలతో సాచి కొట్టినట్టు ఉంటుంది. ఇది వేమన శైలి.

డా. లింగనబోయిన లేఖానందస్వామి రాసిన "ఊట ఖండకావ్యం"లో కూడా ప్రతి పద్యం స్వయం ప్రకాశితంగా నింగిన వెలిగే తారల వంటివే కన్పిస్తాయి. ఈ ఆటవెలదులు ప్రత్యేక శైలిలో ఉంటాయి. ఊట ఖండకావ్యం రచన మొదటి అధ్యాయం సంస్కృతితో మొదలయ్యి చివరి అధ్యాయం వేగుచుక్కతో ముగుస్తుంది.

గ్రంథ పరిచయానికి ముందు గ్రంధ రచయిత గురించిన సమాచారం కూడా ముఖ్యమైనదే. డా. లింగనబోయిన లేఖానందస్వామి బహుముఖ ప్రజ్ఞాశాలి. వృత్తి రిత్యా చరిత్ర ఉపన్యాసకులుగా సుదీర్ఘకాలం పాటు పనిచేశారు. ప్రవృత్తి దృష్ట్యా కవి, వచన, గేయ రచయిత, నాటకకర్త, నటుడు, దర్శకుడు ముఖ్యంగా పరిశోధకులు. తెలుగు భాషాభిమానం, సాహిత్యాభిలాష వారిని తెలుగు బోధనవైపుకు నడిపించింది. బాల్యంలో కుటుంబ వాతావరణంలో పాడుకున్న జానపద పద్యాలు వారిపై ప్రభావం చూపి వారు పద్యకవిగాఉదయించడానికి అవకాశం కలిగింది.

ఈ ఖండకావ్యంలో ప్రతి పద్యం మకుటాయమానంగా నిలవడానికి వారి విస్తారమైన విషయజ్ఞానం ఉపయోగపడింది. వ్యక్తిగతంగా డా. లింగనబోయిన లేఖానందస్వామి గారు మృదుస్వభావి. నిగర్వి. స్నేహశీలి. వారి వ్యక్తిత్వంలాగే వారి పద్యాలు కూడా నిరాడంబరంగా, విశిష్టంగా ఉంటాయి.

తెలుగు పద్య ప్రక్రియల్లో అందమైంది, సులువైంది ఆటవెలది చంధస్సు. నిబంధనలన్నీ పాటిస్తూ పూర్తి భావాన్ని అందంగా వ్యక్తీకరించగలగడం పద్యరచనలో కష్టసాధ్యమైన పని. పద్యాలు రాయడం నేర్చుకోవాలంటే వాటిలో మనసుకు హత్తుకునేలా చేసే అలంకారాలు, రమ్యమైన అక్షరాలు ప్రయోగించి ఉండాలి. ఆ లక్షణాలన్నీఈ ఊట ఖండకావ్యం పద్యాలలో ఉన్నాయి. పద్యాలు ఛందో వ్యాకరణ నియమాలను తప్పకుండా, ఇటు ధారణ, అటు ఉచ్చారణ సౌలభ్యంతో కర్ణపేయంగా ఉండే విధంగా పద్యాలను రచించారు డా. లింగనబోయిన లేఖానందస్వామి గారు.

మొదటి అధ్యాయం సంస్కృతిలో తెలంగాణ దేవాలయాల వైభవం వర్ణించారు. నాలుగవ పద్యంలో కవిగారి విశాలమైన సాంస్కృతిక దృష్టి బయటపడుతుంది. ఇటీవలే ప్రపంచ వారసత్వ సమపడగా యునెస్కో గుర్తించిన చారిత్రక రామప్ప గురించి అద్భుతంగా వర్ణించారు.

**రాతి శిల్పమంటె రామప్ప సోమప్ప**
**గుడులు వెలుగు చుండె గొప్పగాను**
**రాజసంబు తోడ రాజన్న వెములాడ**
**వేల యేళ్ళుయైన వెలుగుచుండె** (పద్యం 4)

ఊట ఖండకావ్యంలోని కరోనా పద్యాలు చదువుతున్నప్పుడు జరుగుతున్న చరిత్రను ఇంత తేటగా పద్యాలలో బహుశా ఇంకెక్కడా ఇలా రికార్డు కాకపోవచ్చు. వేమన పద్యాలలో చెప్పినట్టు ఈ ఊటపద్యాలలో కూడా సామాజిక బోధ అలతి అలతి పదాలలో ఉంటుంది.

**చేతినివ్వబోకు చేటు కల్గును నీకు**
**ఇల్లు విడిచినంత ఇడుము కల్గు**
**పనియు లేక మనము బాజార్లు తిరుగొద్దు**
**కోవిడంటుకున్న కోలుకోవు** (పద్యం 9)

సమాజహితాన్ని కాంక్షించే ఏ కవి అయినా బాధపడుతాడు. అందుకే చలం అంటాడు శ్రీశ్రీ బాధ ప్రపంచ బాధ అన్నట్టు డా. లింగనబోయిన లేఖానందస్వామి గారు రాసిన ఈ పద్యంలో వారి మనోవేదన హృద్యంగా ఉంటుంది.

**చేతి వృత్తులన్నిచేష్టలుడిగిపోయే**
**తినగతిండి లేక తిప్పలయ్యె**
**కాలు కదప బయట కారోన భయమయ్యే**
**బడుగు జీవి ఇంట పిడుగు పడెను** (పద్యం 23)

పిల్లలకు చిన్నప్పటి నుండే పద్యాలను నేర్పే సాంప్రదాయం మనది. కొద్దిగా పెద్దయ్యాక బడిలో నీతిని బోధించడానికి పద్యం అవసరమవుతుంది. కులం కొన్ని తరాల నుండి సమాజాన్ని పట్టి పీడిస్తున్న రాచపుండు. దీనిని దృష్టిలో పెట్టుకొని కవిగారు బోధించే అలాంటి పద్యం ఒకటి ఇక్కడ పేర్కొంటాను

**కులము మతము లేదు కొలతలు లేవంటూ**
**సంఘమొకటెనంటూ సర్ది చెప్పి**
**సాలు వేసె నాడు సమసమాజమునకు**
**దార్శనికుడు తాను ధరన తొలుత** (పద్యం 56)

పద్యం ఎప్పటికీ గుర్తుండాలంటే అది ధారణకు అనువుగా ఉండాలి. ధారణకు అనువుగా ఉండాలంటే అందులో పద విన్యాసం సరిగా ఉండాలి. పద్యం లయాత్మకంగా, చమత్కారంగా ఉండాలి. అలాంటివే ఈ పద్యాలు. ధారణకు అనువైన పద్యాలను రాయడం వల్ల ప్రాచీన సాహిత్యమంటే ఉండే భయమూ సామాన్యులలో పోతుంది. డా. లేఖానంద స్వామి గారి ఊట ఖండకావ్యంలో ఈ పద్యం చూడండి.

**పాటల నెలరేడు పాటలా విలుకాడు**
**పాటల చెలికాదు బాలుగారు**
**కనులు ముయ చాలు కలలోన కదలాడి**
**ముందు నిలిచినట్లు మురియు చుంటి** (పద్యం 512)

తెలంగాణ నేల స్వభావరీత్యా పంటల సాగు లేకపోవడం, నీటి సమస్యలు వంటివి ఉండడం వలన ఈ నేల రైతాంగ సాయుధపోరాటం వంటి ఉద్యమాలను చూసింది. నాడు వానమామలై జగన్నాధాచార్యులు కర్షకుని కోణంలో రాసిన "రైతురామాయణం" కావ్యములోని పద్యాలలా "నియమిత సాగు నిక్కమైన ధర" అధ్యాయం 9,11,16,22,45లో ఆరు పద్యాలలో రైతు క్షేమానికి అవసరమైన పంటల సాగు గురించి చక్కగా వివరించారు.

**" వాన కాలమంత వరియును పండించు**
**పత్తినాటినంత ఫలితామిచ్చు**
**వేయిమక్కా పంట వేసవి కాలాన**
**ప్రభుత చెప్పినట్లు పంటవేయు"** (పద్యం -86)

తెలుగు భాషాభిమానం, దేశభక్తి, ప్రభు భక్తి కవిలో పుష్కలంగా ఉన్నాయి. చాలా పద్యాలలో అది స్పష్టమవుతుంది.

**విశ్వ తెలుగు సభను విజయాన నడిపించె**
**విశ్వజనత కాంచ విశ్వనగరి**
**తెలుగుదనమునంత తేజల్ల జగతినా**
**కల్వకుంట్ల విభుడు కాంక్షతోని** (పద్యం - 128)

సామాజిక బాధ్యతతో సాహిత్యాన్ని రాసే కవులు సమాజానికి ముఖ్యం. అలాంటి సామాజిక బాధ్యతతో ఈ పద్యాన్ని మనకు అందించారు.

**నరకబోకు చెట్లు నరకాన పడబోకు**
**మర్మ మెరిగి మసలు మాను విలువ**
**మనము పెంచి నంత మనలను పెంచేను**
**తల్లి బిడ్డ రీతి తరువు తీరు** (పద్యం - 155)

బంగి బతుకుల కడగండ్లను, జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను, స్వచ్ఛభారత్ కార్యక్రమంలోని లోపాలను, మరిచిపోతున్న మానవత్వాన్ని తమ పద్యాలలో 20వ అధ్యాయంలో "బంగిబతుకు" పేర పద్యాలలోమనకు గుర్తు చేస్తారు.

**మూత్రమలము మడ్డి మురుగు కాల్వలయందు**
**కల్మశంబు బాపె కర్మజీవి**
**యేహ్య భావ మసలు యెందునా లేకుండ**
**పాకివారు జేసె పనియు నేడు** (పద్యం - 168)

ప్రభుత్వ పథకాల ద్వారా ఆశించిన లక్ష్యాలు నెరవేరకపోవడంతో కవి హృదయంలో ఆవేదన పద్యంలా వచ్చిన సాక్ష్యానికి మచ్చుతునక ఈ పద్యం...

**మత్స్యకారులంత మంచిగా జీవించ**
**చెర్లకుంటలందు చేపబోయ**
**కోట్ల కొలది పిల్ల కుమ్మగా వాటిలో**
**మింగెనంట కట్ట మీనములను** (పద్యం - 191)

ఊట పద్యాలు అనేక అంశాల మీద ఉన్నప్పటికీ ఎక్కువగా కరోనా నేపథ్యంలో ఉన్నాయి. ఈ సమయంలో ప్రపంచమంతా కరోనాతో విలవిలలాడుతున్నారు. మనందరి తరపున కరోనాను పొమ్మని ప్రార్థించే విధానం గమ్మత్తుగా ఉంటుంది

**కరకు కోరలమ్మ కరోనా మమ్మారి**
**కడయు తేర్చు నెపుడొ కలియుగాన**
**వేగపోవె తల్లి వేనొక్క దండాలు**
**చేతునమ్మ నీకు చేతులెత్తి** (పద్యం - 235)

నిజానికి మానవత్వాన్ని మించిన రోగము లేదు. కరోనా నేపథ్యంలో చనిపోయిన శవాల దహన సంస్కారాలు జరిగే పద్ధతి చూసి మనమంతా దుఃఖించాము. కవి ఇక్కడ తన పద్యంలో దుఃఖించిన విధానం హృద్యంగా ఉంటుంది.

**మానవత్వ మనిన మసకబారియుపోయె**
**జాలి లేక పోయె శవము యెడను**
**కాదు కుదదంటు కాట్లోన భీష్మించే**
**తరలిపోయే శవము తావు కొరకు** ( పద్యం - 304)

కరోనా నేపథ్యంలో చేతి వృత్తుల వారు అణగారిన, బడుగు బలహీన బతుకులను, వారి వెతలను తన రాతలోకి తెచ్చారు.

**కళను తప్పిపోయె కళ్యాణ వేదిక**
**తూర్చు నూర్చు వారు దొరలి యేడ్చే**
**కుండలమ్ము వారు కూటికి కుమిలేను**
**చాకలన్న సేవ చచ్చు బడియె** (పద్యం 324)

డా. లింగనబోయిన లేఖానందస్వామి గారు చరిత్ర అధ్యాపకులు. కాబట్టి జాతీయోద్యమం, తెలంగాణ సాయుధపోరాటం, దేశభక్తి, చారిత్రక కట్టడాలు, జాతీయ నాయకులు, కవులు వంటి అంశాలు పద్యాలలో వచ్చి చేరాయి.

**భాగ్యసీమ నాడు భారతదేశంబు**
**ఘజని ఘోరి దాడి కథలు వినెను**
**సిరులు దోయ వచ్చె చేరి తిరిగి పోక**
**సిరుల గనుల కాంచి స్థిరము నుండె** ( పద్యం - 366)

ఇప్పుడు మహిళా భాగస్వామ్యం ఆకాశంలో సగాన్ని మించిపోయింది. అయినా కొన్ని రంగాల్లో వివక్ష కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా కవి హృదయాన్ని కరెంటు లైన్ మన్ ఉద్యోగానికి మహిళ ఎంపిక కావడాన్ని ముదాన్ని కలుగజేసింది. ఆ విషయాన్ని పురస్కరించుకొని ఈ పద్యాన్ని చక్కగా చెప్పారు.

**మహిళ లోకమిపుడు మగవారి పనులను**
**మక్కువంబుతోని మరియు చేసె**
**కలిన కార్యమందు కాంచేము పురుషుల**
**మగువనెపుడు యందు మనము కనుము** (పద్యం -448)

ప్రపంచమంతా లాక్ డౌన్ లో ఉంది. ఈ సమయంలో బడికెళ్ళాల్సిన పిల్లలు ఇంటిదగ్గర ఫోన్ లలో యాప్ ల ద్వారా పాఠాలు వినడం గురించి తల్లి దండ్రులకు ఇలా జాగ్రత్త చెప్పారు.

**యాపు డౌను జేసి అయ్యలు జెప్పేటి**
**పాఠ్యమినుడు యనెను బడికి పోక**
**అమ్మనాన్న యుండి ఆ బిడ్డ నేర్వగా**
**దృష్టి పెట్టమనెను తాము యుండి** (పద్యం -464)

తల్లి భాష గొప్పదనాన్ని వివరించే పద్యం ఇది. ఈ పద్యాన్ని ఆంగ్ల మోజులో పడిపోతున్న సమాజానికి మరియు మన బడిపిల్లలకు కంఠతా నేర్పించాల్సిన అవసరం ఉంది.

**తరములెన్ని యైన తరగని నా భాష**
**తేనే యూట అదియు తెలుగు భాష**
**ద్విత్వయక్షరాలు తెలగాణ సీమలో**
**పదము చివర యుండి పలుకు యాస** (పద్యం - 470)

"స్త్రీలలోన యామె సింగమాయే" అంటూ స్త్రీ జాతి గర్వించేలా తెగువ జూపిన వనిత చాకలి ఐలమ్మ. 58 వ అధ్యాయంలో రాసిన పదకొండు పద్యాలు చదువుతుంటే నాటి దొరల దాష్టికాలు, ఐలమ్మ తెగువ అర్ధమయి నెత్తురు వేడెక్కుతుంది.

**వీర వనిత యామె విస్నూరు గడిపైన**
**తిరుగుబాటు జేసె తెగువ నాతి**
**కొంగు ముడియు వేయ లొంగిందు దొరవాడు**
**తోక ముడిచి పోయె దొడ్డిదారి** (పద్యం - 487)

ఈ పద్యం చదువుతుంటే కాళోజి "అన్నపు రాశులు ఒకచోట....ఆకలి మంటలు మరొక చోట" అనే వాక్యమూ మరియు శ్రీశ్రీ కవి నిర్వచనమూ "కష్ట జీవికి ఇరువైపులా నిలబడేవాడు కవి " అనే వాక్యాలు గుర్తుకు వస్తాయి.

**దున్నువాడు నొకడు దోచేవారు దొరలు**
**చేసినోడి నోట చేయి బోదు**
**గతక గంజి లేక కట్టు బట్టయు లేక**
**కుమిలె పేద నాడు కూటికెపుడు** (పద్యం - 499)

తెలంగాణ గర్వించదగ్గ పద్యకవి దాశరధి. వారు అనేక ప్రసిద్ధ ఖండకావ్యాలు రాశారు. ప్రతి పద్యం అగ్గిరవ్వ. డా. లింగనబోయిన లేఖానందస్వామి గారు తమ పద్యాలలో దాశరధి శైలి కనబడుతుంది. దాశరధి " ఓ నిజాము పిశాచమా....అంటే, ఈ కవి ఇలా అన్నారు.

**ఖాశిమనెడు రజ్వి కర్కోట రజకారు**
**ఎర్రజెండ చూడ వెర్రులెత్తె**
**కత్తిపట్టి వాళ్ళ ఖతము చేయగ వాని**
**సైన్యమొకటి పెట్టె సాయుధముతో** ( పద్యం - 500)

వెనుకబడిన తరగతుల పాలిట వేగుచుక్క మహాత్మా జ్యోతిభా పూలే. వారి జీవిత నేపథ్యంలో రాసిన వేగుచుక్క పద్యాలు చివరి అధ్యాయంగా పేర్కొన్నారు.

**వెనుకబడిన వారి వేగుచుక్కయు పూలే**
**తిమిర తెరలు చీల్చి తెచ్చె వెలుగు**
**మహిళ బతుకు పెంచ మహిలోన పోరాడి**
**అండ నిలిచి వారినాదు కొనియె** (పద్యం - 618)

సూర్యాపేట జిల్లా అప్పన్నపేట గ్రామానికి చెందిన డా. లేఖానంద స్వామి గురించి వారి పద్యాలనుండే స్వీకరించిన పాదాలను చెప్పడం ద్వారా ఈ వ్యాసానికి కొంత పరిపూర్ణత కల్గుతుందని భావిస్తాను

- సమత శ్రీ వల్లాల అచ్చయ్య పరంధాం
+91 99859 09046



## గజ్వేల్‌లో భారీ ఎత్తున హిందూ సంఘాల నిరసనలు

**విశ్వంభర, గజ్వేల్ :** బంగ్లాదేశ్ లో హిందువులపై జరిగిన దాడికి నిరసనగా పార్టీలకు అతీతంగా, హైందవ హిందు సోదరుల ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయం నుండి కోర్టు వరకు ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ దేవాలయాలపై దాడికి నిరసనగా హిందూ ఐక్యవేదిక పిలుపుమేరకు గజ్వేల్ పట్టణంలో వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. పట్టణంలో ప్రధాన వీధుల గుండా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాదయాత్రతో ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో, హిందువులపై జరుగుతున్న దాడులను హిందూ ఐక్యవేదిక నాయకులు ఖండించారు.

## ఉచిత వైద్య పరీక్షలు



**విశ్వంభర, ముస్తాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో ఆయుష్ ఆధ్వర్యంలో వృద్ధాప్య ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హోమియోపతి వైద్యులు మెడికల్ ఆఫీసర్ శశి ప్రభ వృద్ధులకు కీళ్ల నొప్పులు మధుమేహం, అధిక రక్త పోటు, మలబద్ధకం, దమ్ము, దగ్గు, మూత్రపిండాలు, నరాలు సంబంధించిన వాటిపై ఉచిత వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా హోమియోపతి మండల వైద్యాధికారి శశి ప్రభ మాట్లాడుతూ. వృద్ధాప్యంలో వచ్చే మధుమేహం కీళ్ల నొప్పులు వంటి సమస్యల పై ఉచిత పరీక్షలు చేసి వారికి మందులు అందించామని శిబిరంకు రానివారు ముస్తాబాద్ లో హోమియోపతి ఆసుపత్రికి వచ్చి ఉచిత పరీక్షలు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామంలోని ఆయుష్ వైద్య శిబిరంకు అధిక సంఖ్యలో వృద్ధులు పరీక్షలు చేసుకుని ఉచితంగా మందులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశి ప్రభ డిస్టిక్ ప్రోగ్రాం మేనేజర్ తిరుపతి, ఫార్మసిస్ట్ రాజేష్, ప్రవీణ్ ఎమ్మెల్ హెచ్ పి రజిత, రమ్య సిబ్బంది లక్ష్మయ్య ఏఎన్ఎం శాదల జలేంద్ర, ఆశ వర్కర్ అనిత, కవిత, గంగవ్వ సంధ్య విజయ. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మొట్టమొదటిసారిగా 40 అడుగుల భారీ విగ్రహం

### ఎల్లమ్మ బజార్ లో భద్రకాళి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి విగ్రహం ఏర్పాటు



**విశ్వంభర, వరంగల్ :** తెలంగాణ రాజధాని హైద రాబాద్ తరహాలో మొట్టమొదటిసారిగా వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం ఎల్లమ్మ బజా ర్ లో భద్రకాళి ఉత్సవ కమిటీ ఆధ్వర్యం లో ప్రముఖ వ్యాపారవేత్త ఆకు తోట సంజీవ్ మొట్టమొదటి సారిగా 40 అడుగుల ఎత్తులో భారీ గణపతి విగ్రహం ఏర్పా టు చేస్తున్నామని తెలిపారు. విలేకరుల సమా వేశంలో విగ్రహా పోస్టర్ ను ఆవిష్కరింపజేశా రు. అదేవిధంగా ప్రతి ఒక్కరు మట్టి విగ్రహా లను ప్రోత్సహించి వాతావరణ కాలుష్య నివారణకు ఎంతగానో తోడ్పడుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు సంజీవ్ తెలిపారు. వినాయక విగ్రహాలను ప్రతిష్ఠింపజేసే ప్రతి ఒక్కరు, భక్తులు ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి విగ్రహాలను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రతి రోజూ హోమా కార్యక్రమాలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

## బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా యాత్ర



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హర్ ఘర్ తిరంగ యాత్రలో భాగంగా భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో గవర్నమెంట్ హై స్కూల్ బాలురు, బాలికలు, జూనియర్ కళాశాల విద్యార్థులతో 500 మీటర్ల జాతీయ జెండాతో చౌరస్తా నుండి పాత అంగడి బజారు, రాజిరెడ్డి మూల, బస్టాండ్ సమీపంలోని వివేకానంద విగ్రహం వరకు తిరంగా యాత్ర నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, బీజేపీ అధ్యక్షులు ఆకుల శ్రీధర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు లింగపెల్లి జోగేశ్వర్ రావు, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి పొట్లసిరి శ్రీకాంత్, బీజేపీ నాయకులు శ్రీమన్నారాయణ, మంథని రాజేందర్ అంకరి రాజేందర్, బీజేవైఎం సంపత్, సాయి, పూర్ణచందర్, రాజులు సోషల్ మీడియా ఇంచార్జి బల్ల శ్రవణ్, స్కూల్ టీచర్స్ గ్రామస్థులు పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగ లో భాగంగా మంగళవారం బీజేవైఎం అద్వర్యంలో నిర్వహించే తిరంగ బైక్ ర్యాలీని ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కొత్త బస్టాండ్ వద్ద సామూహిక జాతీయ గీతం ఆలపించారు.
– విశ్వంభర, కామారెడ్డి

## బ్రిడ్జిని పునః ప్రారంభించాలని బీజేపీ నిరసన




**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ చౌరస్తాలో ప్రజలు రోడ్డు దాటేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల కోట్లు వెచ్చించి ఐరన్ బ్రిడ్జిని నిర్మించి ప్రారంభించకుండా గాలికి వదిలేసిందని, నాటి నుండి నేటి వరకు బ్రిడ్జీ ఉన్నా కూడా ప్రజలకు ఉపయోగం లేకుండా పోయిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని బీజేపీ జిల్లా కన్వీనర్ డా .ఎస్ మల్లారెడ్డి మండిపడ్డారు. రోడ్డు దాటాలంటే ప్రజలు ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని దాటాల్సి వస్తుందని దీనివల్ల ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతున్నదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ బ్రిడ్జిని పునః ప్రారంభించి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేటట్లు చూడాలని బీజేపీ జిల్లా కన్వీనర్ డా .ఎస్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ చౌరస్తాలో ఉన్న బ్రిడ్జి పైకి ఎక్కి నిరసనలు తెలియజేశారు. బీజేపీ నిరసనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, గాజులరామారం 125 డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, జిల్లా ఉపాధ్యక్షులు గరిగే శేఖర్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు దయాకర్, బావిగడ్డ రవి, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, కొంపల్లి కౌన్సిలర్ రాజి రెడ్డి బీజేపీ గిరిజన మోర్చా కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ అంగిడి మల్లేష్, 130 డివిజన్ అధ్యక్షులు కంది శ్రీరాములు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కవిత హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు 51 వేల మంది పని చేస్తున్నారని, రాష్ట్రంలో ఈ పథకంలో పనిచేస్తున్న మహిళలు అత్యధికంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు బడుగు బలహీన వర్గాలు పని చేస్తున్నారని తెలిపారు. వీరికి గత ప్రభుత్వం అతి తక్కువ వేతనం వెయ్యి రూపాయల తోటి వెట్టిచాకిరి చేయించుకొని తరువాత రెండు వేల రూపాయలు పెంచుతూ ఒక నెల మాత్రమే వేతనం తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ గవర్నమెంట్ మేనిఫెస్టోలో ఫిక్స్ వేతనం 10 వేల రూపాయలు ఇస్తామని చెప్పి గద్దెక్కిన తర్వాత మధ్యాహ్న భోజన కార్మికులని వేతనాలు పెంచకుండా, పెండింగ్లో ఉన్న బిల్లులు పరిష్కారం చేయకుండా, ఏ డిమాండ్ ను పరిష్కారం చేయకుండా తత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల మధ్యాహ్న భోజన కార్మికులు అధ్యక్షులు కార్యదర్శులు, ఆమనగలు ఏరియా కన్వీనర్ జై పెంటయ్య, పద్మ, లక్ష్మమ్మ, రమదేవి, మంజుల బుజ్జమ్మ, పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంటును విజయవంతం చేయాలి

**విశ్వంభర, చింతపల్లి:** ఎంసీసీ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ ముక్కోణపు క్రికెట్ టోర్నమెంట్ ఆగస్టు 15న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ క్రికెట్ ఫ్రెండ్లీ టోర్నీకి దాతలు లింగంపల్లి చంద్రప్రకాశ్, కొమిరిశెట్టి వెంకటయ్య, ఎల్లెంకి వికాస్, ఎండీ. జహంగీర్, వీరమల్ల యాదయ్య, ఉప్పల యాదయ్య, చెనమోని రాములు, మూడు టీమ్స్ కి జెర్సీ స్పాన్సర్లు ఎండీ.యాసిన్ బాబా, గోవిందు యాదగిరి, బీజే యాదవ్ సహకరించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ కి గ్రౌండ్ దాత నల్ల రఘుమారెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు నిర్వాహకులు తెలిపారు. మ్యాచ్ అనంతరం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఎమ్మెల్యే కోమటిరెడ్డిపై కూసుకుంట్ల ఆగ్రహం



**విశ్వంభర, మునుగోడు :** మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి పై మండిపడ్డారు. మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా రాజగోపాల్ రెడ్డి ఎన్నికై ఎనిమిది నెలలు గడుస్తున్నా నియోజకవర్గానికి నిధులు తీసుకురావడంలో విఫలం అయ్యారని ఎద్దేవా చేసారు. తానూ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి 50 కోట్ల రూపాయలు, మండల అభివృద్ధికి 25 కొట్ల రూపాయలు జిహెచ్ఎంసి నిధులు తీసుకువచ్చి శంకుస్థాపనలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని గుర్తు చేసారు. ఇప్పుడు ఆ పనులు ఎక్కడికక్కడ నిలిపివేసి ఇంకా ముందుకు తీసుకువెళ్లకుండా రాజగోపాల్ రెడ్డి నిర్లక్ష్యం గా వ్యవహరించడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేసారు. బిఆర్ఎస్ కార్యకర్తల మీద అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులు గురి చేస్తున్నారు కానీ అభివృద్ధి పనులు మాత్రం చేయట్లేదని దుయ్య బట్టారు.

## నిండు ప్రాణాన్ని కాపాడిన జగద్గిరిగుట్ట పోలీసులు

### టెక్నాలజీ సహకారంతో ఒక గంట వ్యవధిలో కేసు ఛేదించిన పోలీసులు



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో కొన్ని ఇబ్బందులతో ఇంటి నుంచి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని ఫిర్యాదు అందిన ఒక గంట వ్యవధిలోనే టెక్నాలజీ సహకారంతో గుర్తించి నిండు ప్రాణాన్ని జగద్గిరిగుట్ట పోలీసులు కాపాడారు. బీరప్ప నగర్‌కు చెందిన మాలంపాక బాబీ (28) సోమవారం మధ్యాహ్నం ఇబ్బందుల నేపథ్యంలో ఇంట్లో నుంచి డ్యూటీకి వెళున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. అనంతరం తన బావమరిదికి ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. వెంటనే అతని భార్య తెలిసిన వారిని సంప్రదించినా ఆచూకి లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన జగద్గిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్ అతని సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా సికింద్రాబాద్ మహంకాళి ఏరియాలో ఉన్నట్లు గుర్తించి వెంటనే సిబ్బందిని పంపించి ఫిర్యాదు దారునితో పాటు వెతకారు. ఓ లాడ్జ్ లో ఉన్నట్లుగా గుర్తించిన జగద్గిరిగుట్ట పోలీసు సిబ్బంది అతని వద్దకు చేరుకున్నారు. అప్పటికే దోమల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లుగా గుర్తించి గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి టెక్నాలజీ సహకారంతో నిండు ప్రాణం కాపాడటంలో చాకచక్యంగా వ్యవహరించిన జగద్గిరిగుట్ట సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు, సీఐ క్రాంతి కుమార్ అభినందించారు.



## గట్టుప్పలలో హర్ ఘర్ తిరంగా యాత్ర

**విశ్వంభర, ఘట్టుప్పల:** హర్ ఘర్ తిరంగా యాత్ర సందర్భంగా మునుగోడు మండల అధ్యక్షులు రావుల ఎల్లప్ప మండల కమిటీ ఆధ్వర్యంలో ఘట్టుప్పల మండల కేంద్రంలో మహనీయుల విగ్రహాలను శుద్ధి చేసి పూల మాలలు వేశారు. జాతీయ జెండాలను చేతబట్టి వీధి వీధిలో స్వతంత్ర అమరవీరులకు జోహార్లు తెలుపుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ మెంబర్లు, జిల్లా నాయకులు, అసెంబ్లీ నాయకులు, మండల నాయకులు, శక్తీ కేంద్ర ఇన్చార్జిలు, బూత్ అధ్యక్షులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

**విశ్వంభర, మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించడానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వస్తున్న సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా మెట్ పల్లికి చెందిన పలువురు బీజేవైఎం నాయకులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ఆర్మూర్ రంజిత్ మాట్లాడుతూ బీజేవైఎం ఏబీవీపీ పోరాటాల ఫలితంగానే ఈ రోజు బట్టి విక్రమార్క పర్యటన అని పేర్కొన్నారు. కాగా తమను పోలీసులు అరెస్టు చేయడాన్ని బీజేవైఎం నాయకులు ఖండించారు. మంత్రిని ప్రతిపక్ష పార్టీ నాయకులని కలవడానికి అవకాశం ఇవ్వాలని మా సూచనలు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఇకనుంచైన రాష్ట్రవ్యాప్తంగా విద్య వ్యవస్థపై సమీక్ష జరగాలని మెట్ పల్లి పట్టణానికి చెందిన బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ఆర్మూర్ రంజిత్, జిల్లా కార్యవర్గ సభ్యులు కోరుట్ల రాజు, పట్టణ ప్రధాన కలికోట శ్రీకాంత్, ఏబీవీపీ టౌన్ సెక్రెటరీ మంగళపెల్లి మారుతిలను ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## అవయవ దానం

### మరో నలుగురి జీవితాలలో వెలుగులు

**విశ్వంభర, రామన్నపేట :** అశోక్ మరణం ఊరికే పోకుండా, మరో నలుగురి జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ, మృతుడి కుటుంబ సభ్యుల అనుమతి, సహకారంతో మృతుడి అవయవాలు దానం చేసి, మరికొందరి జీవితాలలో వెలుగులు నింపడానికి ముందుకొచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన రాస అశోక్ (39) గత మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయి సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. దుఃఖ శోకంలో ఉన్నప్పటికీ, ఆ కుటుంబం ముందుకు వచ్చి అవయవ దానానికి సహకరించిన కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్ ప్రగాఢ సానుభూతిని తెలిపి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యశోద హాస్పిటల్ అధికారిక లాంచనాలతో గౌరవ వందనం స్వీకరించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గంగుల కృష్ణారెడ్డి, డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండలం, లక్ష్మాపురం గ్రామానికి చెందిన బత్తిని మల్లయ్యకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన 14 వేల రూపాయల చెక్కును అతని ఇంటికి వెళ్ళి కాంగ్రెస్ నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బత్తుల కృష్ణ గౌడ్, తాజా మాజీ సర్పంచ్ ఉప్పు ప్రకాష్, గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని వెంకటేశం, బత్తుల మల్లేశం, ఎం. మాధవరెడ్డి, గొర్ల నరేష్, ఎన్. సంజీవ, బత్తిని నరేష్, కలిమెర వెంకటేశం పాల్గొన్నారు.




## మోడల్ పాఠశాలల్లో బదిలీలు చేపట్టాలి

**విశ్వంభర, డిండి:** డిండి మోడల్ స్కూల్ టీ.ఎస్.ఎమ్ ఎస్.టి.ఎఫ్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో భోజనవిరామ సమయంలో తమకు ట్రాన్స్ఫర్లు కావాలని, ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ మోడల్ పాఠశాలలో గత 11 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను వేంటనే చేపట్టాలని పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయ పరమైన సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో టిఎస్ ఎమ్ఎస్టిఎఫ్ బాధ్యులు, సత్యనారా యణ చిత్తలూరి, జిలానీ, రఘు, వైస్ ప్రిన్సి పాల్ శ్రీనివాసా చారి, జయంతి పల్లవి, అని త, వినుత, జ్యోతి, విజయ పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై క్యాటరింగ్ వర్కర్ లైంగిక వేధింపులు

**విశ్వంభర, పాలకుర్తి:** 8వ తరగతి చదువుతున్న విద్యార్థినిని పాఠశాలలో క్యాటరింగ్ వర్కర్ లైంగికంగా వేదిస్తున్న ఘటన పాలకుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని గత నెల సెలవులపై బాలిక ఇంటికి వెళ్లింది. పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటుండడంతో బాలికను తల్లిదండ్రులు ప్రశ్నించారు. పాఠశాలలో క్యాటరింగ్ వర్కర్ తనను లైంగికంగా వేధిస్తున్నట్టు బాలిక వెల్లడించింది. పాలకుర్తి పాఠశాలకు వెళ్లి విద్యార్థిని తల్లిదండ్రులు క్యాటరింగ్ వర్కర్ ను ప్రశ్నించారు. క్యాటరింగ్ వర్కర్ పై పాలకుర్తి పోలీస్ స్టేషన్లో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.




## వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో
## రైతులకు అవగాహన సదస్సు

**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చిరుధాన్యాలు, మొక్కజొన్న పంటల యొక్క యాజమాన్య పద్ధతుల గురించి శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. పురుగు మందు అవశేషాలను ఎలా నియంత్రించుకోవాలి అనే అంశంపై రైతులతో శాస్త్రవేత్తలు చర్చించారు. అనంతరం వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన – అవశ్యకత గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏఎస్ఐ చంద్రారెడ్డి గంజాయి సేవించచడం వల్ల కలిగే దుష్ప్రభాలను రైతులకు వివరించారు. ఏవో శ్రావణ కుమారి మాట్లాడుతూ గంజాయి సాగు చేసే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించవని, ఎక్కడైనా గంజాయి సాగు చేస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండలం వ్యవసాయ విస్తీర్ణ అధికారులు నరసింహ, మధు, అరుణ, మాధురి, శ్రీలత, మౌనిక, పోలీసు సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.


## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి
## కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మె



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులు తమకు చెల్లించాల్సిన 4 నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని మెరుపు సమ్మెకు దిగి విధులు బహిష్కరించి హాస్పిటల్ గేటు ముందు బైఠాయించారు. వారు చేస్తున్న శ్రమకు నెల నెలా జీతాలు ఇవ్వాల్సి ఉండగా నాలుగు నెలలుగా ఇవ్వకుండా తమతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని, పెండింగ్ జీతాలు ఇవ్వాల్సి ఉన్నప్పుడు తాము సమ్మెకు దిగిన తర్వాత ఒక నెల జీతాలు వేసి చేతులు దులుపుకుంటాన్నారని, మళ్ళీ యధావిధిగా తమకు జీతాలు పెండింగ్ లోనే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి మాత్రం తమకు రావాల్సిన పెండింగ్ జీతాలు ఇచ్చేంత వరకు తాము పస్తులు ఉండైన సమ్మె కొనసాగిస్తామని డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా సీఐటీయూ నాయకులు కార్మికుల పక్షాన నిలబడి సమ్మెలో పాల్గొన్నారు. ఇప్పటికైనా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని కాంట్రాక్టర్ ద్వారా కార్మికులకు రావాల్సిన పెండింగ్ జీతాలు చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు.

### చిరుధాన్యాల యాజమాన్య పద్ధతులపై
## రైతులకు అవగాహన

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని రైతువేదిక నందు వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు మొక్కజొన్న, చిరుధాన్యాల పంటల యాజమాన్య పద్ధతుల పైన శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను అడిగి తెలుసుకుని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆలేరు ఏ డీ ఏ వెంకటేశ్వర్ రావు ఆత్మకూరు(ఎం) మండల



వ్యవసాయ విస్తరణ అధికారినీ చేగూరి మనీషా, వివిధ క్లస్టర్ల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

**టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ**

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం మండలంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమం పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టీ రమ అధ్యక్షతన భద్రాచలం బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులను ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ కృష్ణ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, రాష్ట్రప్రభుత్వం బకాయిపడిన ఐదు వాయిదాల డీఏ సాధించుకోవాలని, ఆమోదయోగ్యమైన ఫిట్మెంట్తో 2023 జులై 1 నుండి తెలంగాణ రెండవ పీఆర్సీ అమలు చేయించుకోవాలని, ట్రెజరీ ఆమోదం పొంది ఆర్థిక శాఖ వద్ద మూలుగుతున్న బిల్లులన్నింటిని క్లియర్ చేయించుకోవాలని, డీఈవో డిప్యూటీ ఈవో ఎంఈఓ డైట్ బీఈడీ కాలేజీ లెక్చరర్ ప్రమోషన్లు జూనియర్ లెక్చరర్ లో 40% ప్రమోషన్ కోట పునరుద్ధరించాలని పలు సమస్యలపై ఉద్యోగులందరూ కలిసి టీఎస్ యుటీఎఫ్ నాయకత్వంలో ఐక్యంగా పోరాటం చేసి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



జిల్లా కార్యదర్శి ఎస్ విజయ్ కుమార్, మండల అధ్యక్షులు ఎం రమేష్ చంద్, ఉపాధ్యక్షులు ఎస్ ఆశాలత, మండల కార్యదర్శి కే పుష్పలత, పాఠశాల ఉపాధ్యాయుని లు పాల్గొన్నారు.

### శ్రీ షిరిడి సాయిబాబాను దర్శించుకున్న
## బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ



**విశ్వంభర, చింతపల్లి:** నాగార్జున సాగర్ వద్ద సుంకిశాలలో సాగర్ జలాల ఒత్తిడికి కుప్పకూలిన ఇన్ టేక్ వెల్ టన్నెల్ రక్షణ గోడను సందర్శించేందుకు వెళ్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ సిరుపూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మార్గ మధ్యంలో నాగార్జునసాగర్ హైదరాబాద్ హైవే పై వున్న చింతపల్లి శ్రీ షిరిడి సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సత్కరించి సాయిబాబా ప్రతిమలను వారికి అందజేశారు. అనంతరం బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై చింతపల్లి శ్రీ షిరిడి సాయిబాబా ఆశీస్సులు ఎల్లవేళలా ఉండి ప్రజలందరూ పాడిపంటలతో సుభిక్షంగా జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా టెంపుల్ చైర్మన్ మంచికంటి ధనుంజయ, బీజేపీ హస్తినాపూర్ డివిజన్ ఇంచార్జ్ నరేష్ యాదవ్, ఆలయ ట్రస్టు సభ్యులు కుంభం పుల్లారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.



## నాటిన మొక్కలను పరిశీలించిన ఎంపీడీఓ రాములు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మంగళవారం మండలంలోని కొరటికల్, పల్లెపహాడ్, సింగారం, మోదుగుకుంటా గ్రామాల్లో పర్యటించి కంపోస్ట్ షెడ్, వనమహోత్సవం నందు నాటిన మొక్కలను ఎంపీడీఓ రాములు నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కంపోస్టు షేడ్డు నందు కంపోస్టు ఎరువును తయారు చేయాలని అన్నారు. వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను బ్రతికించుకోవాలని అన్నారు. కంపోస్టు షేడ్డులో తయారైన ఎరువును మొక్కలకు వాడుకోవాలని తెలిపారు. వీరివెంట ఏపీఓ బోడిగే రమేష్, టీఏ జమాండ్ల యాదిరెడ్డి ఆయా గ్రామాల కార్యదర్శులు నరేందర్ సుజాత, శేఖర్, స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్స్ సుమలత, శైలజ, నాగమణి ఉన్నారు.

## మొబైల్ ఫోన్ల చోరీ
### గుర్తించిన ధరూర్ పోలీస్‌లు

**విశ్వంభర, వికారాబాద్ :** శనివారం వచ్చిందంటే చాలు మార్కెట్ లో వరుసగా సెల్ ఫోన్ల దొంగతనాలు ఎక్కువ అవ్వడంతో ధరూర్ పోలీసులు గస్తీని పెంచారు. అంతే కాకుండా చోరికి గురైన మొబైల్ ఫోన్ల ను "సిఇఐఆర్ " ద్వారా గుర్తించి భాదితులు అయిన "గురుదొట్ల గ్రామానికి చెందిన కొంకణి రాములు, నాసన్ పల్లి గ్రామానికి చెందిన మొగిలి నర్సింలు, వికారాబాద్ మండలం మదన్ పల్లి గ్రామానికి చెందిన శేషికల రెడ్డి లను పిలిపించి వారి ఫోన్లను అప్పగించడం జరిగింది. మార్కెట్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీస్ వారికి తెలియజేయాలని ధరూర్ ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.




## అవయవదానం మరో నలుగురి జీవితాలలో వెలుగులు

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన రాస అశోక్ (39) గత మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయ్యి సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. అశోక్ మరణం ఊరికే పోకుండా, మరో నలుగురి జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ, మృతుడి కుటుంబ సభ్యులు మృతుడి అవయవాలు దానం చేసి, మరికొందరి జీవితాలలో వెలుగులు నింపడానికి ముందుకొచ్చారు. దుఃఖంలో ఉన్నప్పట్టికీ, ఆ కుటుంబం ముందుకు వచ్చి అవయవ దానానికి సహకరించిన కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్ ప్రగాఢ సానుభూతిని కృతజ్ఞతలను తెలిపారు. అనంతరం యశోద హాస్పిటల్ వారు అధికారిక లాంచనాలతో గౌరవ వందనం స్వీకరించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మదర్ డెయిరీ మాజీ



చైర్మన్ గంగుల కృష్ణారెడ్డి, డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



## తులం బంగారం ఖచ్చితంగా ఇవ్వాలి

**విశ్వంభర, కొల్లాపూర్:** ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నోటితోనే నిరుద్యోగులైన ఆడబిడ్డలకు జనవరి ఒకటి నుంచి ప్రతి నెల ఒకటో తేదీ ఇస్తానన్న నిరుద్యోగ భృతి కింద 4,000 ల రూపాయలు ఇంత వరకు ఇవ్వకపోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారత రాష్ట్ర సమితి నాగర్ కర్నూలు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు డీకే మాదిగ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గత వారం కిందట కళ్యాణ లక్ష్మి చెక్కులు వివిధ నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్యేలు, మంత్రివర్యులు పంపిణీ చేయడం సంతోషకరమైన విషయం. కానీ మీరు చెప్పినట్టుగానే తులం బంగారం ఎందుకు ఇవ్వలేదని, ఈ విషయంపై పూర్తిగా క్లారిటీ ఇవ్వాలని రేవంత్ రెడ్డిని డీకే మాదిగ కోరారు. తులం బంగారం కచ్చితంగా ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి తరపున డిమాండ్ చేస్త ఉన్నామన్నారు. ప్రియాంక గాంధీ చెప్పినట్లు నిరుద్యోగ యువతీ యువకులకు నిరుద్యోగ భృతి కింద నాలుగు వేల రూపాయలు, కళ్యాణ లక్ష్మి పథకం కింద అదనంగా ఇస్తానన్న తులం బంగారం ఖచ్చితంగా ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు డీకే మాదిగ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## దివ్యాంగురాలికి వసుధ ఫౌండేషన్ చేయూత

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన ఓ దివ్యాంగురాలికి వసుధ ఫౌండేషన్ మంగళవారం ఆర్థిక సాయం అందచేసి చేయూత నందించింది. కాలనీకు చెందిన బానోత్ సుభద్రకు భర్త మరణించగా ఉన్న ఒక్క కుమార్తె దివ్యాంగురాలు, సుభద్రకు గుండెజబ్బుతో పాటు వెన్నుపూస దెబ్బ తినటంతో ఇల్లుగడవని స్థితిలో ఉంది. దివ్యాంగురాలైన కుమార్తెకు సైతం ఆరోగ్యం బాగోలేదు. ఈ విషయం ఫౌండేషన్ ఛైర్మన్ మంథెన వెంకటరామరాజు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఛైర్మన్ సంస్థ తరుపున ఆర్థిక సాయం విడుదల చేశారు. మంగళవారం 10 వేల రూపాయలను దివ్యాంగురాలికి అందచేయగా వారు ఫౌండేషన్ ఛైర్మన్ మంథెన వెంకటరామరాజు, బాధ్యులు వేఘ్నేశ్న శ్రీనివాస రాజు సమాచారం అందచేసిన చేతన మీ సేవ నిర్వహకులు భూక్యా రంజిత్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పౌండేషన్ సభ్యులు పీవీ సత్యనారాయణ, క్లాసిక్ షరిఫ్, రంజిత్ నాయక్, సీతామహాలక్ష్మీ పాల్గొన్నారు.



## ఎంబీబీఎస్ విద్యార్థినికి ఉప్పల్ ఎమ్మెల్యే బాసట

**విశ్వంభర, ఉప్పల్:** మల్లాపూర్ డివిజన్ కి చెందిన మచ్చ శ్రీనివాస్ కుమార్తె మచ్చ తన్మయి కామినేని అకాడమీ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఎల్‌బీ నగర్ లో ఎంబీబీఎస్ 3 వ సంవత్సరం చదువుతుంది. ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యుడు బండారు లక్ష్మారెడ్డి తన స్వంత నిధులతో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ కి అయ్యే ఫీజు 60,000ల చెక్కును డా.ఏఎస్ రావు నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.

# బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో భారీ తిరంగా బైక్ ర్యాలీ



**విశ్వంభర, కరీంనగర్:** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కరీంనగర్ పట్టణంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగా బైక్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ భగత్ నగర్, గణేష్ నగర్, కమాన్, బస్టాండ్, తెలంగాణ చౌక్, రాం నగర్ సత్యనారాయణ స్వామి దేవాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను మరింత ఘనంగా జరుపుకోవాలని, భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని కోరారు. హర్ ఘర్ తిరంగా ఓ గొప్ప ప్రోగ్రాంమని, దేశ ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పే అద్భుతమైన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి, దేశభక్తిని చాటి చెప్పాలన్నారు. హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలన్నింటినీ విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ మహిళా మోర్చా ఆధ్వర్యంలో భారీ తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించడం జరిగిందని తెలిపారు.



## రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

**● బిఎన్ రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి**

**విశ్వంభర, ఎల్బీనగర్ :** బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందిల నిర్లక్ష్యం వల్ల రోగులు చాలా ఇబ్బంది పడుతున్నారని బి.యన్.రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి సమాచారం అందడంతో ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన రోగుల పట్ల ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆసుపత్రిలో రోగులకు సరైన చికిత్స అందడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దవాఖానకు వచ్చే రోగులతో సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ,పేరుకే ప్రభుత్వ ఆసుపత్రి అయిన, అన్ని రకాల సౌకర్యాలు ఉన్నా కూడా రోగులకు అందుబాటులోకి తీసుకు రావడం లేదని ఆరోపించారు. ప్రజలకు అందుబాటులో లేని ప్రభుత్వ ఆసుపత్రి ఉన్న ఒకటే లేకున్నా ఒకటే అని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలియజేసారు. రోగులపట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హైదర్ నగర్ అభివృద్ధి పనులపై అధికారులతో సమావేశం

**కాలనీ సమస్యలపై కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు సమీక్ష**



**విశ్వంభర, హైదర్ నగర్ :** డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ ఫేజ్ – 1 లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి , చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనులపై జిహెచ్ఎంసి అధికారులతో, కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ హైదర్ నగర్ డివిజన్ సంతులిత, సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామని, అసంపూర్తి గా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామని కాలనీ వాసులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను పరిగణలోకి తీసుకొని కాలనీ లలో స్వయంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజల నుండి సమస్యలను తెలుసుకొని సత్వర పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని వెల్లడించారు. ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తుల ను కూడా పరిగణలోకి తీసుకొని త్వరితగతిన సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు తెలియజేశారు. అదే విధంగా ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి కానీ కార్పొరేటర్ కార్యాలయం దృష్టికి కానీ తీసుకువస్తే పరిష్కరిస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు గారు తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీఈ రమేష్, ఏఈ రాజీవ్, మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, సత్యనారాయణ, హార్టికల్చర్ దాసు, డ్రైనేజి సూపర్వైజర్ ఓం ప్రకాష్, ఎలక్ట్రికల్ లైన్ మెన్ వెంకటేష్, %ాఖీూ% రమణ, ఎంటమాలజి మురళి కాలనీ వాసులు శ్రీనివాస దాసు, సైదేశ్వర్ రావు, రామ లింగేశ్వర రావు, విలియమ్స్, ఆంజనేయులు, ప్రసాద రావు, శ్రీనివాస్, చంద్ర మౌళి, ప్రసాద్, మహిళలు కృష్ణ కుమారి, జ్యోతి, ఉమా రాణి మరియు నాయకులు కుమార స్వామి, నిరంజన్ గౌడ్, నిఖిల్ పాల్గొన్నారు.

## ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

**విశ్వంభర, వికారాబాద్:** బీజేపీ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గాలయ్య ఆ పార్టీ నాయకులతో హైదరాబాద్ లోని ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గాలయ్య వికారాబాద్ జిల్లాలోని ఎస్సీల సమస్యలను తీర్చే విధంగా కృషి చేయాలని ఎంపీని కోరారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిసిన వారిలో ఎల్లకొండ మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ యాదవ్, బీజేపీ పార్టీ సీనియర్ నాయకుడు అర్జున్ తదితరులు ఉన్నారు.





## చెరుకు శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**విశ్వంభర, ఎల్బీనగర్:** రంగారెడ్డి జిల్లా కెమిస్ట్, ఫార్మసీస్ట్, దిల్ సుఖ్ నగర్ సద్గురు మెడికల్ అండ్ జనరల్ స్టోర్ చెరుకు శ్రీనివాస్ అకాల మరణం చెందారు. వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు జిల్లా అధ్యక్షులు డా. పెండెం కృష్ణ కుమార్ పిలుపు మేరకు సేవా దృక్పథంతో మెడికల్ షాప్ యజమానులు విరాళాలు అంద చేశారు. విరాళాలు మొత్తం రూ. 25,002 ల చెక్ ను షాప్ యజమాని సతీమణి చెరుకు స్రవంతికి అసోసియేషన్ అధ్యక్షులు డా. పెండెం కృష్ణ కుమార్, ట్రెజరర్ సత్యనారాయణ, పున్న శ్రీనివాసులు, లలిత శ్రీనివాస్, దాతలు కలిసి అందజేశారు. సకాలంలో స్పందించి సహృదయంతో విరాళం అందజేసిన దాతలకు అధ్యక్షులు డా. పెండెం కృష్ణ కెమిస్ట్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ మెడికల్ శ్రీనివాస్ గౌడ్, కస్తూరి శ్రీనివాస్ కౌసల్య మెడికల్, జె ఎం ఎస్ మధుసూదన్, నాగరాజు లు ఉన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**విశ్వంభర, నారాయణపూర్:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన మేకల మహేష్ రూ.38,500 లు, ఆరుట్ల శంకరయ్య రూ. 22,500ల విలువైన చెక్కులను చిమిరాల మాజీ సర్పంచ్ తుమ్మల నర్సిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఆపదలో ఆదుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చెక్కులను మంజూరి చేయించినందుకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం)నాయకులు దౌల జంగయ్య, సుర్వి కృష్ణమూర్తి, వోగూరి చంద్రయ్య, కేసాని రమేష్, కేసాని అంజయ్య, కేసాని చంద్రయ్య, గోపాల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాలేజీ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ




**విశ్వంభర. భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎస్.ఎఫ్.ఐ బృందం పరిశీలన చేశారు. ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజు, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలు సుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్క రించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు గత కొన్ని సంవత్సరాలుగా బాత్రూమ్స్, వాటర్ సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు బయటకు వెళ్ళవలసిన పరిస్థితి ఎదురవుతుందని ఈ సమస్యలన్ని కళ్ళ ఎదుట కనిపిస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. తక్షణమే కాలేజీ విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థులతో కలిసి నిరసన తెలియజేశారు. తక్షణమే సమస్యలపై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేసింది. అధికారులు స్పందించకపోతే విద్యార్థులు అందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కాలేజీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గణేష్, నరేష్, కమిటీ సభ్యులు రాము, లక్ష్మణ్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.



## హిందువులపై దాడులను నిరసిస్తూ ర్యాలీ

**విశ్వంభర, పరిగి:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హత్యాచారాలు, దాడులను నిరసిస్తూ మంగళవారం పరిగి పట్టణంలో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో హిందూ బంధువులు వివిధ పార్టీల నాయకులు, విద్యార్థులు వెంకటేశ్వర దేవాలయం నుండి బహర్ పెట్, అంబేద్కర్ చౌరస్తా నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్ లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై దాడిని వెంటనే మానుకోవాలని దాడులు చేసిన వారిని శిక్షించాలని నినాదాలు చేస్తూ శాంతియుత నిరసన ర్యాలీని చేపట్టారు.



## అన్నదానం మహాదానం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నాగరాజు

**విశ్వంభర, ఎల్బీనగర్:** అన్నదానం మహాదానం అని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నాగరాజు అన్నారు. మంగళవారం ఎల్బీనగర్ చౌరస్తా లో రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఓల్డ్ ఏజ్ హోమ్ వనస్థలిపురం ఆధ్వర్యంలో 100 రోజులు 100 మందికి టిఫిన్స్ లో బాగంగా టిఫిన్స్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఆకలితో అలమటించే వారి కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం ఎంతో మందికి ఆకలి తీరుస్తుంది అని అన్నారు. కార్యక్రమంలో ఫౌండర్ శంకర్, సెక్రటరీ ప్రవీణ్ గుప్త, మహేష్ పాల్గొన్నారు.




## గ్రంథాలయ అభివృద్ధికి దేవేందర్ సేవలు అభినందనీయం

**విశ్వంభర, ఎల్బీనగర్:** గ్రంథాలయ పరిషత్ అభివృద్ధికి, పాఠకులకు మెరుగైన సేవలు అందించడంలో మాజీ గ్రంథపాలకుడు, తెలంగాణ ప్రజా గ్రంథాలయాల అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ అందించిన సేవలు అభినందనీయమని గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ పేర్కొన్నారు. గ్రంథపాలకుల దినోత్సవంలో భాగంగా అఫ్జల్ గంజ్ లోని రాష్ట్ర గ్రంథాలయ సంస్థలో జరిగిన కార్యక్రమంలో దేవేందర్ కు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ గ్రంథ పాలకుల దినోత్సవసందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ తనను సన్మానించడం జీవితంలో మరిచిపోలేనని అన్నారు.



## తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**విశ్వంభర, పరిగి:** ధరణిలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తహసీల్దార్ ఆనంద్ రావు ను ఆదేశించారు. మంగళవారం పరిగి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డు రూమ్, రిజిస్ట్రేషన్ రూమ్, డేటా ఎంట్రీ రూమ్ లలో రికార్డ్స్, రిజిస్టర్ లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని, పెండింగ్ ఉన్న దరఖాస్తులను వేగవంతంగా ప్రణాళికా బద్ధంగా పరిష్కరించాలని, మ్యుటేషన్ వంటి దరఖాస్తుల రికార్డులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అనంతరం ఏం పీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజాపాలనల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్లో డేటా విభాగంలో వెంటనే ఎంట్రీ చేయాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అందించిన గృహజ్యోతి, మహాలక్ష్మి(గ్యాస్) పథకం విజయవంతంగా కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే ప్రక్రియలో పొరపాట్లను సరి చేసుకునేందుకు ప్రజాపాలన సేవా కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, ఏంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## 'పాఠశాలలో పిల్లలు ఉన్నారు కానీ చదువు చెప్పే పంతులు లేడు"

### విశ్వంభర పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన ఎంఈఓ శ్రీధర్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం తుక్కాపురం గ్రామంలో చదువు చెప్పే పంతులు లేకుండా ఎనిమిది రోజుల నుండి పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పాఠాలు చెప్పే టీచర్ మరో ఊరికి ప్రమోషన్ పై వెళ్లడంతో పిల్లలు చదువు చెప్పే టీచర్ లేక చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. గత శుక్రవారం విశ్వంభర పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు ప్రస్తుతం సర్వేపల్లి గ్రామంలో విధులు నిర్వహిస్తున్న టీచర్ సంతోషని తుక్కాపురంలోని పాఠశాలకు ఎంఈఓ శ్రీధర్ తాత్కాలికంగా నియమించారు. విశ్వంభర పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన ఎంఈఓ శ్రీధర్ సర్వేపల్లి పాఠశాలలో విధులు నిర్వహించే టీచర్ సంతోషని తుక్కాపురం పాఠశాలకు తాత్కాలికంగా నియమించడాన్ని గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు చాలా సంతోషం వ్యక్తం చేసి విశ్వంభర పత్రికకు, ఎంఈఓ శ్రీధర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం తుక్కాపురం స్కూల్ ని కూరెళ్ళ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మిర్యాల దామోదర్ సందర్శించి నూతనంగా వచ్చిన టీచర్ సంతోషకు గ్రామంలో పిల్లలను అధిక సంఖ్యలో స్కూల్ కు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూరెళ్ళ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మిర్యాల దామోదర్, సీ.ఆర్.పీ నరసయ్య, టీచర్ సంతోషం పాల్గొన్నారు.

## దాన ధర్మాలతోనే మనిషికి గౌరవం



**విశ్వంభర, ఆమనగల్లు:** నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని ప్రతి విద్యార్థినీ విద్యార్థులు కష్టం అనుకోకుండా ఇష్టపడి చదువుకొని జీవితాలను బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవాలని ఆమనగల్లు లయన్స్ క్లబ్ కోశాధికారి విశ్రాంత ఉపాధ్యాయుడు గుజ్జరి నరసింహ అన్నారు. మంగళవారం గుజ్జరి నరసింహ భార్య కీర్తిశేషులు హైమావతి జ్ఞాపకార్థం ఊరుకొండ పేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులకు ప్యాడ్స్, అట్లాస్, జామెంట్రీ బాక్స్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. దానధర్మాలతోటే మనిషికి గౌరవం వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఊరుకొండ పేట ఎంఈఓ శంకర్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్, పాఠశాల ఉపాధ్యాయులు హబీబున్నీసా బేగం పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ సమావేశం



**విశ్వంభర, ఖమ్మం :** ఎనిమిది నెలలు గడిచిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మళ్ళింపాటి అప్పారావు విలేకరుల సమావేశం లో పాల్గొని మాట్లాడారు. ఖమ్మం జిల్లా లు సీతారాం ప్రాజెక్టు ద్వారా నీళ్ళు అందించే దిశగా ముగ్గురు మంత్రు లు కృషి చేయాలని అన్నారు. అలాగే ఒంటరి మహిళలకు 2500, షాదీ ముబారక్ ,కళ్యాణ లక్ష్మి, తులం బంగారం, లక్ష పదహార్లు, తులం బంగారం హామీలు నెరవేర్చాలని సిఎం రేవంత్ రెడ్డి నీ కోరారు. కౌలు రైతులకు రైతుబంధు, రైతులకు రుణమాఫీ తక్షణమే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాలేరు నియోజకవర్గ ఇన్చార్జి తెలుగుదేశం పార్టీ కొండబాల కర్ణాకర్, నాగార్జున, శ్రీనివాస్, మాజీ సింగల్ విండో చైర్మన్ గుడిపూడి వెంకటేశ్వర్లు, వైరా నియోజకవర్గ నాయకులు కిలారు సురేందర్, పాలడుగు కృష్ణ ప్రసాద్, కర్నాటి అశ్వని కుమార్, దొడ్డ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో... తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విలేకరుల సమావేశంలో మల్లెం గాపాటి అప్పారావు మాట్లాడుతూ ఎనిమిది నెలలు గడిచిన అమలు కానీ ఆరోగ్యారంటీలు ఖమ్మం జిల్లాకు సీతారాం ప్రాజెక్టు నీళ్లను అందించే విధంగా ముగ్గురు మంత్రులు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు ఒంటరి మహిళలకు 2500 షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి పేరు మార్చి తులం బంగారం లక్ష్య పదహార్లు తులం బంగారం ఇస్తామన్నారు రేవంత్ రెడ్డి గారు వెంటనే ఇది అమలు చేయాల్సిందిగా డిమాండ్ చేశారు కవులు రైతులకు రైతుబంధు రైతులకు రుణమాఫీ తక్షణమే విడుదల చేయాలి ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాలేరు నియోజకవర్గ ఇన్చార్జి తెలుగుదేశం పార్టీ కొండబాల కర్ణాకర్, నాగార్జున, శ్రీనివాస్, మాజీ సింగల్ విండో చైర్మన్ గుడిపూడి వెంకటేశ్వర్లు, వైరా నియోజకవర్గ నాయకులు కిలారు సురేందర్, పాలడుగు కృష్ణ ప్రసాద్, కర్నాటి అశ్వని కుమార్, దొడ్డ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు



## రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

**విశ్వంభర, ఆమనగల్లు:** అమంగల్ పట్టణ కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం రజక సంఘం యువజన సంఘం కమిటీ సభ్యులను సన్మానించారు. నూతన కమిటీ సభ్యులు భారీ ర్యాలీగా హైదారాబాద్ ఆమనగల్ చౌరస్తాకు చేరుకొని రజక సంఘ జెండా ఆవిష్కరించారు. రజక సంఘం అధ్యక్షులుగా నగిళ్ళ బుచ్చయ్య, ఉపాధ్యక్షులు నాగిళ్ళ జంగయ్య, అంజయ్య, రజక సంఘం ప్రధాన కార్యదర్శి నాగిళ్ల తిరుపతయ్య, కోశాధికారి పాతకోట పకీర, ప్రచార కార్యదర్శి నగిళ్ళ బాలయ్య, కార్యదర్శి నాగిళ్ళ శ్రీను, ప్రధాన సలహాదారు నగిళ్ళ చందు, యువజన కార్యవర్గం అధ్యక్షులు మద్దూరి ఆనంద్, ఉపాధ్యక్షులు మద్దూరి కుమార్, పాతకోట రాజు, ప్రధాన కార్యదర్శి శేఖర్, కార్యదర్శి సంధరాజు పర్వతాలు ప్రమాణ స్వీకారం చేశారు.

## ఎస్సీ వర్గీకరణ విజేత మంద కృష్ణ మాదిగ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** ఎస్సీ వర్గీకరణ కొరకు జీవితం త్యాగం చేసి ముప్పై ఏండ్లుగా ఉద్యమించిన ఎం.ఆర్.పీ.ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అని ఎం.ఆర్.పీ.ఎస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు సుప్రీం కోర్టు వెలువరించిన తర్వాత ఢిల్లీ నుండి మొదటిసారి హైదరాబాద్ కు విచ్చేసిన సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం, ఆత్మకూరు(ఎం) మండలం నుండి మంద కృష్ణ మాదిగ స్వాగత ర్యాలీకి భారీగా తరలి వెళ్లారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ చౌరస్తా మీదుగా బషీర్ బాగ్ జగ్జీవన్ రామ్ చౌరస్తా వరకు లక్షలాది మందితో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పీ.ఎస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, బలహీన వర్గాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కానుగంటి శ్రీశైలం కురుమ, ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల బాలరాజు మాదిగ, మండల కోఆర్డినేటర్ మందుల లింగ స్వామి మాదిగ, సీనియర్ నాయకులు గట్టు రాములు మాదిగ, పందుల భిక్షపతి మాదిగ, ఎంఈఎఫ్ నాయకులు మందుల ఐలయ్య మాదిగ, గంధమల్ల వినోద్ మాదిగ, గోసంగి పరమేష్ మాదిగ, బొట్ల గణేష్ మాదిగ, వేముల సంజీవ మాదిగ పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని ఇసుక మడుగులో మధ్యమత్తులో ఈతకు వెళ్లి నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పెద్ద శంకరంపేట పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన మహమ్మద్ ఇలియాస్ (30) పేట శివారులోని ఇసుకమడుగులో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడని ఎస్ఐ శంకర్ తెలిపారు. మహమ్మద్ ఇలియాస్ లారీ డ్రైవర్ గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు అన్నారు. ఈనెల 12న మహమ్మద్ ఇలియాస్ తన ముగ్గురు స్నేహితులతో కలసి ఇసుక మడుగు వద్ద మద్యం సేవించిన అనంతరం ఇసుకమడుగులో ఈత కొట్టడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడని ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి మహమ్మద్ హసీనా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## జ్యోతిర్లింగాల దేవాలయంలో లక్ష బిల్వార్చన

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని జ్యోతిర్లింగాల దేవాలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని భక్తులు మంగళవారం స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. భక్తులు ఉదయం నుండి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ముడుపతి రాజ్ కుమార్ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.





## వెటర్నరీ డాక్టర్‌ను సన్మానించిన మాజీ ఎంపీపీ అరవింద్ రావు

**విశ్వంభర, పరిగి:** వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని రంగాపుర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించిన వెటర్నరీ డాక్టర్ రామకృష్ణ బదిలీపై వెళ్లడంతో అతనిని మంగళవారం గ్రామ పెద్దలతో కలిసి మాజీ ఎంపీపీ కరణం అరవింద్ రావు పూలమాల వేసి శాలువాతో సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయ్, ప్రధానోపాధ్యాయులు బసవేశ్వరి, నూతన వెటర్నరీ డాక్టర్ ఆనంద్, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత తాగునీరు అందిస్తున్న నాంది ఫౌండేషన్



**విశ్వంభర, నారాయణపూర్:** నారాయణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడి కేంద్రాలలోని పిల్లలకు ఉచితంగా సురక్షిత ఆర్వో ఫిల్టర్ వాటర్ పంపిణీ కార్యక్రమాన్ని నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో వసంత్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వసంత్ కెమికల్ ప్రతినిధి రజిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత సురక్షిత త్రాగునీరు మా సంస్థ ద్వారా అందిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు ఆరోగ్యంగా ఉండేలా శుభ్రమైన మంచినీరు అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాంది వాటర్ మార్కెటింగ్ మేనేజర్ వెంకటస్వామి, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, నాంది వాటర్ సిబ్బంది శ్రీనివాస్, నాగరాజు, భాను, అశ్విన్, మహేందర్ నాథ్, మాధవి, జ్యోతి, బాలరాజు, గ్రామపంచాయతీ సిబ్బంది చంద్రకాంత్ పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** ఇంటర్మీడియట్ విద్యార్థులు కష్టపడి కాదు ఇష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పెద్ద శంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. మంగళవారం పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సర ఇంటర్ విద్యార్థులకు స్వాగత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇంటర్మీడియట్ దశ విద్యార్థికి ఎంతో కీలకమైంది అన్నారు. కష్టపడి చదివి మంచి మార్కులు సంపాదించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్ ల బృందం, సిబ్బంది అనంతరాజు శర్మ, రాజు శ్రీశైలం, ప్రభాకర్, అభిలాష్, అశోక్, సిద్దయ్య, శారద, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ సీలింగ్ ల్యాండ్ సర్వే నెంబర్ 91లో అక్రమ నిర్మాణాలను తాహసిల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ సాయిరాం ఆధ్వర్యంలో మంగళవారం కూల్చివేశారు.

– విశ్వంభర, ఘట్కేసర్

# జైలు నుంచి విడుదలైన ఆశారాం బాపు

## ఏడురోజుల పెరోల్‌ను మంజూరు చేసిన హైకోర్టు

**ముంబయి:** మైనర్ వేధింపుల కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఆశారాం బాపు జైలు నుంచి విడుదలయ్యారు. ఆరోగ్య కారణాల నేపథ్యంలో ఆయన ఏడురోజుల పెరోల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. ఆయన మహారాష్ట్ర మధోబాగ్‌లో చికిత్స పొందనున్నారు. అయితే, ఈ సమయంలో ఆయన పోలీస్ కస్టడీలోనే ఉండనున్నారు. ఆశారాం బాపు చికిత్స కోసం పెరోల్ కోసం దరఖాస్తు చేసుకుంటూ వస్తుండగా గతంలో తిరస్కరణకు గురయ్యాయి. పోలీస్ కస్టడీలో ఉన్న సమయంలో జోధ్‌పూ-ర్‌లోని ప్రైవేటు ఆయుర్వేద ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు అనుమతి లభించింది. అక్కడ పుణేకు చెందిన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందారు. మళ్లీ ఆరోగ్యం క్షీణించడంతో జోధ్‌పూర్ ఎయిమ్స్‌కు తరలించారు. ఆయన మళ్లీ పెరోల్ కోసం దరఖాస్తు చేసుకోగా.. కోర్టు ఏడురోజులు అనుమతి ఇచ్చారు. జూన్ 20న ఆశారాం కోర్టు నుంచి 20 రోజుల పాటు పెరోల్ కోరారు. పెరోల్ కమిటీ దాన్ని తిరస్కరించింది. 85 ఏళ్ల ఆశారాం బాపు 2013 నుంచి జోధ్‌పూర్ జైలులో ఉంటున్నారు. మైనర్‌పై అత్యాచారం చేసిన కేసులో ఆశారాం బాపును జోధ్‌పూర్ పోలీసులు 2013లో ఇండోర్‌లో అరెస్టు చేశారు. ఆశారాం తన ఆశ్రమంలో ఓ టీనేజీ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డట్లుగా ఆరోపణలున్నాయి.



ఈ కేసులో ఐదేళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత 25 ఏప్రిల్ 2018న కోర్టు ఆశారాంకు జీవిత ఖైదు విధించింది. ఆశారాం బాపుకు 85 ఏళ్లు ఉన్నాయి. వయో సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. అయితే, పోస్కో కేసు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన గత ఏడాది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆరోగ్య సంబంధిత కారణాలతో జీవితఖైదును రద్దు చేయాలని కోరగా.. తోసిపుచ్చింది. వైద్యం కోసం రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇచ్చింది. దాంతో రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించారు. ఏడు రోజుల పెరోల్‌కు హైకోర్టు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

# ఎన్నికల్లో ఓడిపోతే దేశాన్ని వదిలి వెళ్లిపోతా

## ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు

**వాషింగ్టన్:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలోనే రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ను ప్రముఖ బిలియనీర్ ఎలాన్ మస్క్ ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేశారు. ఇందులో మాజీ అధ్యక్షుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నవంబరులో జరిగే ఎన్నికల్లో ఓడిపోతే.. దేశాన్ని వీడతానంటూ తన ప్రణాళికలను బయటపెట్టారు."ఈ ఎన్నికల్లో ఏదైనా జరిగితే.. పరిస్థితి ఘోరంగా ఉంటే (తన ఓటమిని ఉద్దేశిస్తూ) మనం మళ్లీ వెనెజువెలాలో కలుద్దాం. మన భేటీకి అమెరికా కంటే సురక్షితమైన ప్రదేశం అదే. అందుకే నేను అక్కడికి వెళ్లిపోతా. మీరూ రండి. మనం సమావేశమవుదాం. డిన్నర్ చేద్దాం" అని మస్క్‌కు ట్రంప్ చెప్పారు. వెనెజువెలాలో ప్రమాదకరమైన నేరస్థులను కూడా జైళ్ల నుంచి విడుదల చేసి అమెరికాకు అక్రమంగా వలస పంపిస్తున్నారని మాజీ అధ్యక్షుడు ఆరోపించారు. అందుకే అక్కడ నేరాల రేటు పడిపోయి.. అగ్రరాజ్యంలో నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని దుయ్యబట్టారు. ఇలాంటివారిని ఆపడమే తన లక్ష్యమని ట్రంప్ చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వలసల చట్టాన్ని మరింత కఠినతరం చేస్తానని, అక్రమ వలసదారులను అడ్డుకుంటానని అన్నారు. ఇటీవల వెనెజువెలాలో జరిగిన ఎన్నికల్లో నికోలస్ మదురో మరోసారి ఎన్నికైన



సంగతి తెలిసిందే ఈ ఫలితాలపై అమెరికా అనుమానం వ్యక్తంచేసింది. అటు మస్క్ కూడా మదురో విధానాలను తీవ్రంగా విమర్శిస్తుంటారు. అక్కడి అధ్యక్ష ఎన్నికల్లోనూ మదురో ప్రత్యర్థికి మస్క్ మద్దతు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఇటీవల 10 రోజుల పాటు వెనెజువెలాలో 'ఎక్స్'పై నిషేధం విధిస్తూ అధ్యక్షుడు ప్రకటన చేయడం చర్చనీయాంశమైంది. ఇదిలాఉండగా.. మస్క్ తో ట్రంప్ ఇంటర్వ్యూకు విశేష ఆదరణ లభించింది. ఈ కార్యక్రమాన్ని ఏకంగా 200 మిలియన్ల మందికిపైగా విన్నారు. దీన్ని 'ఎక్స్' స్పేస్లో లైవ్ స్ట్రీమింగ్ చేశారు.

### వైద్య కళాశాలలు కీలక అడ్వైజరీని

# జారీ చేసిన జాతీయ మెడికల్ కమిషన్

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వైద్య కళాశాలలకు జాతీయ మెడికల్ కమిషన్ మంగళవారం అడ్వైజరీని జారీ చేసింది. కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన నేపథ్యంలో మార్గదర్శకాలను జారీ చేసింది. తప్పనిసరిగా మార్గదర్శకాలను అమలు చేయాలంటూ.. అన్ని వైద్య కళాశాలల్లో సురక్షితమైన పని వాతావరణాన్ని నిర్ధారించేందుకు ఈ అడ్వైజరీని జారీ చేసింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఆదేశాల మేరకు అడ్వైజరీని జారీ చేసింది. ఇటీవలి కాలంలో వైద్య కళాశాలల్లో వైద్యులపై హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కళాశాల, ఆసుపత్రి ప్రాంగణంలో అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లతో సహా సిబ్బందికి సురక్షితమైన పని వాతావరణం కల్పించాలని సూచించింది. క్యాంపస్, రెసిడెన్షియల్ క్వార్టర్స్‌లోని ఓపీడీ, వార్డులు, క్యాజువాలిటీ, హాస్టళ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో తగిన భద్రతా చర్యలు ఉండేలా చూడాలని చెప్పింది. అన్ని సున్నిత ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని చెప్పింది. ఓపీడీ, వార్డులు, క్యాజువాలిటీ, లేబర్ రూమ్, హాస్టల్స్, రెసిడెన్షియల్ క్వార్టర్స్, మెడికల్ కాలేజీ, హాస్పిటల్ ప్రాంగణంలో ఇతర బహిరంగ ప్రదేశాలలో భద్రతా సిబ్బందిని మోహరించాలని.. ఇందులో మహిళా సిబ్బంది ఉండేలా చూడాలని చెప్పింది. అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించింది. వైద్య విద్యార్థులపై హింసాత్మక సంఘటన జరిగిన వెంటనే కళాశాల యాజమాన్యం విచారణ చేసి.. పోలీసులతో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చెప్పింది. సంఘటనకు సంబంధించిన వివరణాత్మక చర్యలకు సంబంధించిన నివేదికను సంఘటన జరిగిన 48 గంటల్లోగా ఎన్ఎంసీకి పంపాలని ఆదేశించింది. అంతకుముందు జేపీ నడ్డా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోల్‌కతాలో మహిళా డాక్టర్ హత్య చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో నడ్డాకు ఐఎంఏ లాఖ రాసింది. ఈ సందర్భంగా పలు డిమాండ్లు ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకువచ్చింది.

# వైద్యురాలిపై హత్యాచారం కేసు సీబీఐకి అప్పగింత..

## 3 వారాల్లోగా నివేదిక ఇవ్వాలంటూ హైకోర్టు ఆదేశం

**కోల్ కతా:** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఘటనను నిరసిస్తూ వైద్యులు ఆందోళన బాట పట్టారు . గత ఐదు రోజులుగా దేశవ్యాప్తంగా విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కోల్‌కతా హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించింది. కోర్టు పర్యవేక్షణలో కేసు దర్యాప్తు జరగాలని మృతురాలి తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఘటన జరిగి ఐదు రోజులైనా పోలీసుల దర్యాప్తులో పురోగతి లేదంటూ మండిపడింది. ఈ మేరకు కేసును సీబీఐకి బదిలీ చేస్తూ హైకోర్టు చీఫ్ జస్టిస్ శివజ్ఞానం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకూ విచారణ చేపట్టిన రాష్ట్ర పోలీసులు కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను బుధవారం ఉదయం లోగా సీబీఐకి అందజేయాలని ఆదేశించారు. ఈ కేసును పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి మూడు వారాల్లోగా నివేదిక ఇవ్వాలి సీబీఐ అధికారులను కోర్టు ఆదేశించింది.



# కేసీఆర్‌కు బిగ్ షాక్ ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్లాన్

- బీఆర్‌ఎస్‌కు చెక్ పెట్టేలా స్కెచ్
- కాంగ్రెస్‌లో చేరనున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు
- రేవంత్ హైదరాబాద్ రాగానే జాయినింగ్

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ని టార్గెట్ చేస్తూ ఇటీవల కాలంలో బిఆర్ఎస్ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, నేతలు రోజుకు ఒక అంశం పైన రేవంత్ సర్కార్ ను టార్గెట్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ చేసిన తర్వాత ప్రజలు కాంగ్రెస్ పార్టీ పైన కాస్త సానుకూలత వచ్చింది. ఇక ఆ తర్వాత వరుసగా రేవంత్ రెడ్డి బృందం పెట్టుబడుల కోసం విదేశాలలో పర్యటించడం కూడా ఓ రకంగా తెలంగాణ రాష్ట్రానికి సానుకూల అంశమే. అయితే వీటి పైన ప్రజల ఫోకస్ పడకుండా రేవంత్ సర్కార్ ను తమదైన శైలిలో కేటీఆర్, హరీష్ రావులు టార్గెట్ చేస్తున్నారు . కేటీఆర్, హరీష్ రావు చేసే వ్యాఖ్యలను తిప్పి కొట్టడంలో రేవంత్ క్యాబినెట్ మంత్రులు ఫెయిల్ అవుతున్నారు.

### బీఆర్ఎస్‌కు చెక్ పెట్టేలా స్కెచ్..

ఇక ఈ క్రమంలోనే రాష్ట్రంలో బీఆర్ఎస్ దూకుడుకు చెక్ పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లుగా దానికోసం ఒక ప్లాన్ కూడా రెడీ చేసినట్టుగా సమాచారం. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ కు తిరిగి వచ్చిన వెంటనే మరొకమారు కాంగ్రెస్ పార్టీలో చేరికలు ఉంటాయని, ఈ చేరికలతో బిఆర్ఎస్ నేతలకు షాక్ ఇవ్వాలని రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

### కాంగ్రెస్‌లో చేరనున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

ఇప్పటికే కాంగ్రెస్‌కు దగ్గరగా ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు





మంతనాలు జరుపుతున్నారని, రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ లో అడుగు పెట్టగానే వరుసగా ఎమ్మెల్యేల చేరికలు కాంగ్రెస్ పార్టీలో ఉంటాయని చెబుతున్నారు. గతంలో రేవంత్ రెడ్డి తో కలిసి పని చేసిన నాయకులు పార్టీ మారబోతున్నారని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పార్టీ మారే నాయకులతో ఇప్పటికే చర్చలు పూర్తయ్యాయని చెబుతున్నారు.

### రేవంత్ హైదరాబాద్ రాగానే ప్లాన్ అమలు..

ఇందులో ఒక మాజీ మంత్రి కూడా ఉన్నట్టుగా ప్రచారం జరుగుతున్న వేళ చివరి నిమిషం వరకు సస్పెన్షన్ కొనసాగించే అవకాశం ఉన్నట్టు సమాచారం. సీఎం రేవంత్ హైదరాబాద్ రాగానే రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చిన రేవంత్ రెడ్డిని అభినందిస్తూ వరుసగా హడావిడి చేయాలని ప్లాన్ చేసిన కాంగ్రెస్ నాయకులు ఇదే సమయంలో రేవంత్ ప్లాన్ లో భాగంగా బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ ఇవ్వాలని కూడా నిర్ణయించినట్టు తెలుస్తుంది.

### కేసీఆర్ కు చెక్ పెట్టేప్లాన్..

గ్రేటర్ హైదరాబాద్ నుండి ముగ్గురు ఎమ్మెల్యేలను రోజుకు ఒక్కొక్కరు చొప్పున పార్టీలో చేర్చుకోపోతున్నట్టు ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ లో చర్చ జరుగుతుంది. తమపై మాటల దాటిన పెంచిన బీఆర్ఎస్ నేతలకు, అధినేత కేసీఆర్ కు చెక్ పెట్టే బిగ్ ప్లాన్ లో రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మరి ఇది ఏ మేరకు వర్క్ అవుట్ అవుతుందో వేచి చూడాలి.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరో జత యూనిఫాంలు

- ప్రతి నెలా మూడు రోజుల పాటు స్వచ్ఛదనం-పచ్చదనం డ్రైవ్
- గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై మంత్రి సీతక్క రివ్యూ

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరో జత యూనిఫాం లు సిద్ధం చేసి పంపిణి చేయాలని పంచాయతీ రాజ్,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మంత్రి సీతక్క రివ్యూ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ%8౯%స్వచ్ఛదనం, పచ్చదనం సక్సెస్ చేసిన అందరికి అభినందనలు చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం, స్వయం సహాయక సంఘాల బలోపేతంపై జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో మంగళవారం నాడు రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి పారిశుధ్య కార్మికుల వరకు బాగా కష్టపడ్డారని తెలిపారు. మంచి పనితీరు కనబరిచిన సిబ్బందికి ఆగస్టు 15వ తేదీన సన్మానిస్తామని చెప్పారు. గతంలో పోలిస్తే ఎక్కువ పని జరిగిందని.. కానీ మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని వివరించారు. మండలాల వారిగా రివ్యూలు చేసి సమగ్ర నివేదికలు ఇవ్వాలని సూచించారు. గతంలో పోలిస్తే ఎక్కువ పని జరిగిందని కాని మరింత మెరుగు పడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇక నుంచి ప్రతి నెలా మూడు రోజుల పాటు స్వచ్ఛదనం-పచ్చదనం డ్రైవ్ కొనసాగుతుందని పాములతో ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. క్లీనింగ్ మీద దృష్టి సారించాలని సూచించారు . పారిశుధ్య లోపాలపై వార్తలు వస్తే సరిదిద్దాలని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల వరకు అధికారులు ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని గ్రామా పంచాయతీ స్పెషల్ అధికారులు ఉదయం కనీసం మూడు గంటల పాటు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యత్వాన్ని కోటి మందికి చేర్చాలి..మహిళా శక్తి ప్రోగ్రాంలో ఎస్సీ, ఎస్టీ మహిళల భాగస్వామ్యం పెంచాలని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చికున్ గున్యా వంటి విష జ్వరాలతో ఊర్లకు ఊర్లు మంచాన పడ్డాయని ఆవే దన వ్యక్తం చేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని జ్వర సర్వేలు చేసి జ్వర నివారణకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. అయినా తప్పుడు వార్తలు రాస్తూ బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారం చేస్తే అధికారుల వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. లేకపోతే ప్రభుత్వ పనితరం సరిగా లేదనే సంకేతాలు వెళ్తాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# త్వరలో మంత్రివర్గ విస్తరణ?

- నాలుగు మంత్రి పదవులు
- పలువురికి నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసే అవకాశం

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నప్పటికీ, వాటిలో నాలుగు మాత్రమే ఇప్పుడు భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. మిగతా రెండు మంత్రి పదవుల్లో ఒకదాన్ని మైనారిటీల కోసం, మరోదాన్ని పార్టీ ప్రాధాన్యమిచ్చే నాయకులకు కేటాయించేందుకు పక్కన పెడుతున్నట్లు సమాచారం. ఇక నాలుగు మంత్రి పదవుల కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మంత్రి పదవుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్ కూడా ఈ పోటీలో ఉన్నారు. మంత్రి పదవులు ఆశించి భంగపడే ఎమ్మెల్యేలకు నామినేటెడ్ పదవులు




ఇవ్వాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. ఆర్టీసీ, పౌర సరఫరాలు, మూసీ డెవలప్‌మెంట్ అథారిటీ వంటివి వారికి కేటాయించి, ఆయా విభాగాలకు క్యాబినెట్ హోదా కల్పించే అవకాశం ఉంది. ఏఐసీసీ స్థాయిలో సీఎం రేవంత్ చర్చించిన తర్వాతే ఈ పదవుల భర్తీపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకోగానే మంత్రి పదవుల భర్తీకి సంబంధించిన కసరత్తు వేగవంతం అవుతుందని తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి రేపు (బుధవారం) హైదరాబాద్‌కు చేరుకుంటారు. మరుసటి రోజు స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొంటారు. ఈ నెల 16న రాష్ట్ర పాలనాపరమైన అంశాలపై దృష్టి సారిస్తారు. ఈ నెల 17న లేదంటే 18న ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ హైకమాండ్‌తో భేటీ అయి మంత్రి పదవుల కేటాయింపుపై చర్చించే అవకాశం ఉంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అవకాశాలు కల్పించడంలో సామాజిక సమతుల్యతను పాటించేందుకు పీసీసీ అధ్యక్ష పదవితోపాటు నాలుగు పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్ష పదవులను త్వరగానే భర్తీ చేయనున్నారు. పీసీసీ అధ్యక్ష పదవి కోసం ఎంపీ బలరాం నాయక్, సంపత్ కుమార్, మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ పోటీపడుతున్నారు. వీరిలో ఒకరికి పీసీసీ అధ్యక్ష పదవిని కేటాయించే అవకాశం ఉందట. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డిని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తారని అంచనా వేస్తున్నారు.

## జోగి రాజీవ్‌కు రిమాండ్
# విధించిన ఏసీబీ కోర్టు



**అమరావతి:** అగ్రిగోల్డ్ భూ వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేశ్ తనయుడు రాజీవ్ కు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఈనెల 23 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. అంబాపురం అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో సీఐడీ అధికారులు రాజీవ్ను మంగళవారం ఉదయం అరెస్టు చేశారు. ఈ అంశంలో మొత్తం 9 మందిపై కేసు నమోదైంది. ఈ కేసులో ఏ1గా రాజీవ్, ఏ2గా జోగి రమేశ్ బాబాయ్ వెంకటేశ్వరరావు ఉన్నారు. వీరిపై ఐపీసీ 420, 409, 467, 471, 120(బి) సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ నివాసంలో ఉదయం నుంచి ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. అనంతరం రాజీవ్ను అదుపులోకి తీసుకుని గొల్లపూడి కార్యాలయానికి తరలించారు. విజయవాడ జీజీహెచ్లో వైద్య పరీక్షల అనంతరం ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

## ఆగస్ట్ 15న మూడో విడత రుణమాఫీ..!



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ఎన్ని ఇబ్బందులు ఉన్నా తెలంగాణ ప్రభుత్వం రైతుల రుణ మాఫీ చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల లోపు రైతు రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ ప్రకారం మూడు విడతల్లో రుణ మాఫీ చేస్తామని పేర్కొంది. ఇప్పటికే రెండు దఫాలుగా రుణ మాఫీ చేసింది. మొదట రూ.లక్ష లోపు వరకు రుణ మాఫీ చేయగా.. రెండో విడతలో రూ.1.50 వరకు రుణ మాఫీ చేసింది. ఇప్పుడు మూడో విడత రుణ మాఫీకి కసరత్తు చేస్తోంది. ఆగస్ట్ 14న లేదా 15న మూడో విడత రుణ మాఫీ చేయనున్నారు. రూ.2 లక్షల లోపు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేయనున్నారు. జులై 18వ తేదీన మొదటి విడతగా లక్ష రూపాయల స్లాబ్ వరకు రుణమున్న రైతులకు ఏకకాలంలో రుణ మాఫీ చేశారు. దక్షిణ కొరియా పర్యటన లో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ చేరుకున్న తర్వాత మూడో విడతకు సంబం ధించి నిధులు విడుల చేసే అవకాశం ఉంది. ఖమ్మం జిల్లా వైరా మండలంలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొని రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేయనున్నట్లు తెలుస్తోంది. లేకుంటే ఆగస్ట్ 15న హైదరాబాద్ లో మూడో విడత రుణ మాఫీ చేసే అవకాశం ఉంది. మూడో విడత రుణ మాఫీ అవసరమైన నిధులపై దృష్టి పెట్టింది. ఈమేరకు మూడో విడత రుణ మాఫీ కోసం నిధులను సిద్ధం చేస్తోంది. మూడో దశలో భాగంగా మరో 6 లక్షల మంది రైతుల రుణాలను మాఫీ చేయాల్సి ఉంది. ఇందుకు రూ.6,000 కోట్లకు పైగా అవసరమవుతాయని అంచనా వేశారు. ఆగస్ట్ 6న బహిరంగ మార్కెట్ నుంచి ప్రభుత్వం రూ.3,000 కోట్ల అప్పును తీసుకుంది. మరో రూ.3,000 కోట్ల కోసం ఆర్బీఐ వద్ద అప్పు చేయనుంది. ఈ రోజు జరిగే ఆర్బీఐ ఈ-వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 3 వేల కోట్ల అప్పును తీసుకోనుంది. ఆగస్ట్ 15తో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రుణ మాఫీ హామీ ముగియనుంది.




## మరింత స్ట్రాంగ్‌గా 'హైడ్రా'

- క్యాడర్ స్ట్రెంథ్ కు సర్కారు గ్రీన్ సిగ్నల్
- త్వరలోనే 259 మంది పోలీసు ఆఫీసర్ల నియామకం
- త్వరలోనే రెండింతలు కానున్న హైడ్రా స్టాఫ్
- అక్రమ నిర్మాణాలపై ముమ్మరం కానున్న చర్యలు

**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సర్కారు ఆస్తులను కాపాడటంతో పాటు మరింత పటిష్టంగా విపత్తుల నిర్వహణ చేపట్టేందుకు ఏర్పాటైన హైడ్రా ఇపుడు మరింత స్ట్రాంగ్ కానుంది. ఇప్పటికే ఆక్రమణలపై కొరడా ఝుళిపించేందుకు అన్ని రకాల అనుమతులిచ్చిన సర్కారు ఇపుడు తాజాగా క్యాడర్ స్ట్రెంథ్ కు పచ్చ జెండా ఊపింది. ఇటీవలే ఏర్పాటైన హైడ్రా కబ్జాలు, ఆక్రణలపై మరింత సమర్థవంతంగా చర్యలు చేపట్టేందుకు వీలుగా మొత్తం11 క్యాటగిరీలకు చెందిన వివిధ హెదాల్లో మొత్తం 259 మంది పోలీసు ఆఫీసర్లతో క్యాడర్ స్ట్రెంథ్ ను సర్కారు ప్రకటించింది. వీరంతా హైడ్రాలో డిప్యూటేషన్ ప్రాతిపదికన పని చేయనున్నట్లు సర్కారు ఉత్తర్వుల్లో వెల్లడించింది. వీరిలోఓ ఐపీఎస్ ఆఫీసర్ ఉండగా, మరో ముగ్గురు నాన్ క్యాడర్ ఆఫీసర్లుండనున్నారు. అత్యధిక సంఖ్యలో 101 మంది పోలీస్ కానిస్టేబుళ్లను నియమించుకోవాలని సర్కారు ఆదేశాలిచ్చింది. డీఎస్పీ, ఇన్ స్పెక్టర్, సబ్ ఇన్ స్పెక్టర్లతో పాటు రిజర్వ్ ఇన్ స్పెక్టర్, రిజర్వ్ సబ్ ఇన్ స్పెక్టర్, హెూం గార్డులతో పాటు అనాలిటికల్ ఆఫీసర్లు, అసిస్టెంట్ అనాలిటికల్ ఆఫీసర్లు వంటి క్యాటగిరిల్లో సిబ్బందిని నియమించుకోనున్నట్లు సర్కారు ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరి నియామకం జరిగిన తర్వాత హైడ్రా ఆక్రణమలు, అక్రమ నిర్మాణాలపై చర్యలను మరింత వేగవంతంగా చేయనున్నట్లు సమాచారం. ప్రత్యేక భూ కబ్జాలు, చెరువులు, నాలాలను ఆక్రమించి నాలాలు చేపడితే ఫిర్యాదులను లోతుగా పరిశీలించి, క్షేత్ర స్థాయి సందర్శనలు చేసి, బాధ్యులను డెడ్ లైన్ లోపు గుర్తించి, కోర్టుల్లో శిక్షలు పడేలా హైడ్రా వ్యూహం ఉండబోతున్నట్లు సమాచారం.

## ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల
# కేటాయింపు జీవో నిలిపివేత

### మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ హైకోర్టు




**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లోని వైద్య కళాశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారి కోటా సీట్ల కేటాయింపుపై ఏపీ హైకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల కేటాయింపు జీవోను నిలిపివేస్తూ మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సీట్ల కేటాయింపు జీవోను సవాలు చేస్తూ మెడికల్ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. సీట్లు పెంచకుండా ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్లు కేటాయిస్తే ఓపెన్ కేటగిరీలో విద్యార్థుల కు నష్టం వాటిల్లుతుందని విద్యార్థులు కోర్టును ఆశ్రయించారు. వెంటనే ఈ జీవోను నిలుపద చేస్తూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును కోరా రు. మెడికల్ సీట్లు పెంచి ఈడబ్ల్యూస్ కింద సీట్లు ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది ఠాకూర్ వాదించారు. పిటిషనర్ వాదనను అంగీకరించినా న్యాయస్థానం జీవోను నిలుపు దల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను ఆరు వారాలకు ఏపీ హైకోర్టు వాయిదా వేసింది. ఈడబ్ల్యూఎస్ కోటాను కేం ద్రం 2019లో ప్రవేశపెట్టింది. మొత్తం సీట్లలో పదిశాతం ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు కేటాయించాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 56 మెడి కల్ కాలేజీలుండగా వాటిలో ఐదారు కళాశాల ల్లోనే కోటా అమలు చేస్తున్నారు. ఈ జీవో వల్ల యూజీలో 572, పీజీలో 180 సీట్లను విద్యార్థులు నష్టపోయే అవకాశముంది.



## తెలంగాణ ఉద్యోగులను రిలీవ్ చేసిన ఏపీ సర్కారు

**విశ్వంభర, అమరావతి :** తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులను ఏపీ ప్రభుత్వం మంగళవారం రిలీవ్ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన ఉద్యోగులను తిరిగి వారి స్వరాష్ట్రానికి పంపేలా ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం 122 మంది తెలంగాణా స్థానికత కలిగిన నాన్ గెజిటెడ్ ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. తెలంగాణా ప్రభుత్వం నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు 122 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులను తెలంగాణకు రిలీవ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం వేర్వేరు విభాగాల్లో పనిచేస్తున్న తెలంగాణ స్థానికత కలిగిన ఉద్యోగులను రిలీవ్ చేసే ముందు వారి నుంచి అంగీకారం తీసుకోవాలని స్పష్టం చేసింది. తెలంగాణకు రిలీవ్ అవుతున్న ఉద్యోగులు తమ కేడర్‌లోని చివరి ర్యాంక్‌లో మాత్రమే చేరుతారని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## గురుకులాలను ప్రక్షాళన చేస్తాం..
# నిధులు సమకూరుస్తాం

- మంత్రులు, ఎమ్మెల్యేలు నెలకొక రోజు గురుకులాల పర్యటన
- గురుకుల భవన నిర్మాణాలకు బడ్జెట్లో రూ.5 వేల కోట్లు
- పెద్దాపూర్‌లో విద్యార్థుల మృతి ప్రభుత్వాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది
- పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలను ప్రక్షాళన చేసి ప్రాంగణాలను అత్యంత పరిశుభ్రతగా తీర్చిదిద్దడంతో పాటు అవసరమైన నిధులను సమకూర్చుతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. నెలలో ఒక రోజున రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు శాసనసభ్యులు గురుకుల పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో భోజనం చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ఆలోచనకు అనుగునంగా జిల్లా కలెక్టర్లు, డిఎంహెచ్వోలు సైతం నెలలో ఒక రోజున గురుకుల పాఠశాలలో బస చేయాలని సూచించారు. జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని గురుకుల పాఠశాలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంగళవారం డిప్యూటీ సీఎం సందర్శించారు. గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల మృతి నలుగురు విద్యార్థుల అస్వస్థతకు సంబంధించిన కారణాల గురించి విద్యార్థులు తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. తీవ్ర దుఃఖ సాగరంలో ఉన్న తల్లిదండ్రుల ఆవేదనను చూసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భావోద్వేగానికి గురయ్యారు. కంటతడి పెట్టుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను ఓదార్చిన అనంతరం వారితో సమావేశమయ్యారు అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ప్రజా ప్రభుత్వంలో బడ్జెట్ పెట్టడానికి ముందు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులను తెలుసుకొని విద్యా, వైద్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ వార్షిక బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించినట్లు వివరించారు. హెూరాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేనివిధంగా గురుకుల పాఠశాలల పక్క భవనాల నిర్మాణం కోసం ఈ బడ్జెట్ లో ప్రజా ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించిందన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న గత పాలకులు గురుకుల పాఠశాలల పక్కా భవనాల నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించిందని మండిపడ్డారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా అర కొర వసతుల మధ్యన నేడు విద్యార్థులు అనుభవిస్తున్న దుస్థితి అని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల పక్క భవనాల నిర్మాణం కొరకు గత ప్రభుత్వం 2015-16 ఆర్థిక సంవత్సరంలో 197 కోట్ల కేటాయించగా 2016 17 ఆర్థిక సంవత్సరం నాటికి 116 కోట్ల రూపాయలకు కుదించిందన్నారు. 2018- 19 సంవత్సరంలో రూ. 79 కోట్లు, 2019-20 వార్షిక సంవత్సరంలో 70 కోట్లు, 2020-21 వార్షిక సంవత్సరంలో కేవలం 11 కోట్లు, 2021-22 వార్షిక సంవత్సరంలో 9 కోట్లు, 2022-23 వార్షిక సంవత్సరంలో ఏడు కోట్లు, 2023 24 వార్షిక సంవత్సరానికి మూడు కోట్లు మాత్రమే కేటాయించిందని వివరించారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మానవ వనరులను అభివృద్ధి చేసుకోవాలని ప్రపంచంతో పోటీపడే విద్యను అందించాలని విద్యకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి గొప్ప ఆలోచనతో ముందుకెళ్తున్న తరుణంలో పెద్దాపూర్ లో ఇద్దరు విద్యార్థులను కోల్పోవడం ప్రజా ప్రభుత్వాన్ని తీవ్రంగా కలిచిసి వేసిందని బాధపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో పక్క భవనాల నిర్మాణం కోసం కావలసిన నిధులు, భవనాల నిర్మాణ కావలసిన స్థల సేకరణకు అయ్యే నిధులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని గత కలెక్టర్ల కాన్ఫరెన్స్ లోనే ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రభుత్వ హాస్టల్స్ లో చదివే విద్యార్థులకు హెల్త్ కార్డ్స్ ఉండేదనీ, ప్రతి నెల డాక్టర్లు వచ్చి వారి ఆరోగ్యాన్ని చెక్ చేసి కార్డులో రాసే వారని గుర్తు చేశారు. అదేవిధంగాహెూప్రభుత్వ హాస్టల్లోనే పారామెడికల్ స్టాఫ్ ఉండేవారని. అ విధానాన్ని తిరిగి తీసుకురావాలని గురుకులాలహెూసెక్రటరీని ఆదేశించారు

### విద్యార్థుల డైట్ ఛార్జీల పెంపునకు కమిటీ వేస్తాం...

పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలు పెంచడానికి త్వరలోనే అధికారులతో కమిటీ వేస్తామని ప్రకటించారు. కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత డైట్ ఛార్జీలను పెంచుతామని వెల్లడించారు. గురుకుల పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి నేలపైన పడుకోవడానికి వీలులేదని, కచ్చితంగా మంచం, బెడ్, బెడ్ షీట్ ను ప్రభుత్వ సమకూర్చుతుందన్నారు. ఇందుకోసం ప్రతిపాదనలు పంపితే నిధులు విడుదల చేస్తామని గురుకులాల సెక్రటరీ రమణ కుమార్ కు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి గురుకులంలో అత్యవసర ఔషధాలు, పారా మెడికల్ స్టాఫ్, కుక్కకాటు, పాముకాటుకు సంబంధించిన మందులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గురుకులాల సెక్రెటరీని ఆదేశించారు. శుచి, శుభ్రత పాటిస్తూ నాణ్యత గల ఆహారాన్ని అందించాలని సూచించారు. ప్రతి గురుకుల పాఠశాలలో టాయిలెట్స్, బాత్రూములు విద్యార్థులకు అనువుగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సమృద్ధిగా నీరు, విద్యుత్తు, గురుకుల పాఠశాలకు కావలసిన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఈజీఎస్ పనుల కింద గురుకుల పాఠశాలలో చెత్తా, చెదారం పిచ్చి మొక్కలు తొలగించి, పండ్లు, ఔషధ మొక్కలు నాటించాలని చెప్పారు. గురుకులాల్లో పనిచేసే వార్డెన్స్, టీచర్స్, పారామెడికల్ సిబ్బంది రాత్రి సమయాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

### పెద్దాపూర్ పాఠశాలకు రూ.50 లక్షలు మంజూరు

పెద్దాపూర్ గురుకుల పాఠశాల ప్రాంగణంలో నీటి కుంటలు, చెత్తాచెదారం లేకుండాహెూఅభివృద్ధి చేయడానికి, టాయిలెట్స్ నిర్మాణం కోసం ఇతర సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 50 లక్షలు మంజూరు చేశామన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగాహెూర్మీటరీ, డైనింగ్ హాల్స్, భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించిన వెంటనే ఒక్కరోజు ఆలస్యం చేయకుండా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. 12 ఎకరాలు ఉన్న పెద్దాపూర్ పాఠశాలలో భవన నిర్మాణం కోసం 2020-21 వార్షిక సంవత్సరంలో నిధులు మంజూరు చేసి విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులను ఆపి వేసినట్లు అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసిన వెంటనే ఆ నిధులు మా ప్రభుత్వం ఇస్తుందన్నారు. పెద్దాపూర్ గురుకుల పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని, నీటి కుంటలు చెత్తాచెదారం లేకుండా చూడాలని కలెక్టర్ ను ఆదేశించినట్లు చెప్పారు.

### విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం అండ..

మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకుహెూప్రభుత్వం అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలకు ఎక్స్గ్రేషియా తో పాటు గురుకుల సొసైటీలో వారి విద్యా అర్హతకు అనుగుణంగా ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ఇల్లు లేకుంటే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించినట్లు చెప్పారు. మృతి చెందిన విద్యార్థుల పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత దాని ఆధారంగా విచారణ ఉంటుందన్నారు.

# బాక్సర్లకు విదేశీ కోచ్‌లు

## భారత బాక్సింగ్ సమాఖ్య కీలక నిర్ణయం





**విశ్వంభర, స్పోర్ట్:** పారిస్ ఒలింపిక్స్‌లో భారత బాక్సర్ల బృందం తీవ్రంగా నిరాశపరిచింది. ఆరుగురిలో ఏ ఒక్కరు కూడా పతకం గెలవలేకపోయారు. దాంతో, భవిష్యత్ పోటీలను దృష్టిలో పెట్టుకొని భారత బాక్సింగ్ సమాఖ్య కీలక నిర్ణయం తీసుకుంది. విదేశీ కోచ్‌లను నియమించేందుకు సిద్దమైంది. మంగళవారం బీఎఫ్ఏ విదేశీ కోచ్‌లను ఆహ్వానిస్తున్నట్టు ప్రకటన విడుదల చేసింది.'భారత బాక్సింగ్ సమాఖ్య జాతీయ జట్టు కోసం విదేశీ కోచ్‌లను వెతుకుతోంది. ఎంపికైనవాళ్లు నాలుగేండ్ల పాటు సేవలు అందించాల్సి ఉంటుంది. లాస్ ఏంజెల్స్‌లో 2028లో జరుగబోయే ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్‌వెల్త్ క్రీడలు.. ఇతర పోటీల్లో భారత బాక్సర్లు అత్యుత్తమ ప్రదర్శన చేయాలనేది మా ఉద్దేశం. ఇక అర్హతల విషయానికొస్తే.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కోచింగ్ అనుభవం ఉన్నవాళ్లు, ఒలింపిక్ విజేతలను తయారుచేసినవాళ్లకు తొలి ప్రాధాన్యం ఇస్తాం' అని బీఎఫ్ఏ తెలిపింది. ప్రస్తుతం కోచ్‌గా ఉన్న దిమిత్రి మిత్రుక్ రెండేండ్ల పాటు పదవిలో కొనసాగనున్నాడు. క్వార్టర్స్ దాటలేక..ఒలింపిక్స్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత బాక్సర్లు పతకంతో మెరవలేకపోయారు. టోక్యోలో కాంస్యం తెచ్చిన లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు) ఈసారి క్వార్టర్స్ దాటలేకపోయింది. తెలంగాణ బిడ్డ నిఖత్ జరీన్ (50 కిలోలు) అనూహ్యంగా 16వ రౌండ్‌లోనే వెనుదిరిగింది. జైస్మినె లంబోరియా(57 కిలోలు), ప్రీతి పవార్(54 కిలోలు)లు కూడా సత్తా చాటలేదు.ఇక పురుషుల విభాగంలో అమిత్ పంగల్(51 కేజీ) స్థాయికి తగ్గట్టు ఆడలేదు. యువకెరటం నిషాంత్ దేవ్(71 కిలోలు) క్వార్టర్స్ చేరినా మరో అడుగు వేయలేకపోయాడు. దాంతో, భారత బాక్సింగ్ సమాఖ్యకు నిరాశే మిగిలింది.

# రెజ్లింగ్ చేయడం అంత సులువు కాదు

- రెండు కిలోల మినహాయింపు ఇవ్వాలి
- భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్

**విశ్వంభర, స్పోర్ట్స్:** పారిస్ ఒలింపిక్ లో భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ 57 కిలోల విభాగంలో ఉడుం పట్టు పట్టి కాంస్య పతకం సాధించాడు. సెమీస్ లో గెలిచి ఫైనల్కు చేరతాడని భావించినా ఓడిపోయాడు. కాంస్య పతకం మ్యాచ్లో 13-5తో దరియన్ టోయ్ క్రజ్ (ప్యూర్టోరికో)ను ఓడించాడు. అయితే, కాంస్య పతక పోరుకు ముందు అమన్ మూడున్నర కిలోల బరువు పెరిగాడట. ఈ విషయాన్ని అతడే స్వయంగా వెల్లడించాడు. బరువు తగ్గించుకోవడం కోసం రాత్రంతా కసరత్తులు చేసి ఒక్క నిమిషం కూడా నిద్రపోలేదని తెలిపాడు. "కనీసం 15-20 రోజుల ముందు బరువును సెట్ చేసుకోవాలి. కానీ, బౌట్ల సమయంలో బరువు సమస్యగా మారుతుంది. కాంస్య పతక బౌట్కు ముందు నా బరువు సుమారు 3.5 కిలోలు పెరిగింది. దానిని తగ్గించుకోవడానికి నేను రాత్రంతా మేల్కొని ఉండాల్సి వచ్చింది. కొన్ని సార్లు కొంచెం నీరు తాగినా బరువు పెరుగుతాం. బౌట్ జరిగే ముందురోజు రాత్రి మాత్రమే కాదు, రెండు రోజుల ముందు కూడా నిద్రపోవడం మాకు కష్టంగా ఉంటుంది. ఎందుకంటే మేము ఖాళీ కడుపుతో ఉండాల్సి ఉంటుంది. ఏమీ తిననప్పుడు నిద్ర పట్టదు. రెజ్లింగ్ చేయడం చాలా కష్టంతో కూడుకున్నది. కాబట్టి.. రెజ్లర్ల ఇబ్బందిని దృష్టి ఉంచుకొని బౌట్ సమయంలో బరువు విషయంలో రెం డు కిలోల మినహాయింపు ఇవ్వాలి" అని అమన్ సెహ్రా వత్ కోరాడు. 2024 ఒలింపిక్స్లో ఇండియా తరపున పోటీపడిన ఏకైక పురుష రెజ్లర్ అమన్ కావడం విశేషం. ఒలింపిక్స్లో వ్యక్తిగత పతకం గెలిచిన అతి పిన్న వయసున్న (21 ఏళ్ల 24 రోజులు) భారత అథ్లెట్గా అతను చరిత్ర సృష్టించాడు.





# వినేశ్ రజతంపై ఉత్కంఠ..

## తీర్పు మళ్లీ వాయిదా..!

**విశ్వంభర, స్పోర్ట్స్:** పారిస్ ఒలింపిక్స్‌లో రజతం కోసం పోరాడుతున్న భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్ కు మళ్లీ నిరాశే ఎదురైంది. సర్వత్రా ఉత్కంఠ నెలకొన్న వినేశ్ అప్పీల్‌పై తీర్పును అర్బిట్రేషన్ కోర్టు (సీఏఎస్) మళ్లీ వాయిదా వేసింది. షెడ్యూల్ ప్రకారం మంగళవారం రాత్రి 9:30 గంటలకు తీర్పు ఇవ్వాలి. కానీ, ఆగస్టు 16 శుక్రవారం సాయంత్రం లోపు ఏదో ఒకటి తేల్చేస్తామని సీఏఎస్ ఏదో ఒకటి చెప్తామని తెలిపింది. దాంతో, మరో వినేశ్‌తో పాటు యావత్ భారతం సిల్వర్ మెడల్ వస్తుందా? లేదా? అని మూడు రోజులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 'వినేశ్ ఫోగాట్ అప్పీల్‌పై తీర్పును మరో మూడు రోజలకు వాయిదా వేయడానికి కారణాన్ని కూడా సీఏఎస్ వెల్లడించింది. ఒలింపిక్ గేమ్స్ సీఏఎస్ అర్బిట్రేషన్ నియమాల్లోని ఆర్టికల్ 18 ప్రకారం తీర్పును సీఏఎస్ అడ్ హక్ డివిజన్ అధ్యక్షుడు వాయిదా వేశారు. ఆగస్టు 16 సాయంత్రం 6 గంటలలోపు తీర్పు చెప్పాలని తీర్మానించారు' అని సీఏఎస్ అడ్ హక్ డివిజన్ ఓ ప్రకటనలో తెలిపింది.

### ఏం జరిగిందంటే..?

పారిస్ ఒలింపిక్స్‌లో 50 కిలోల విభాగంలో వినేశ్ ఫొగాట్ అంచనాలు అందుకుంటూ ఫైనల్ చేరింది. ఆగస్టు 7 బుధవారం ఉదయం అమెరికా రెజ్లర్ సరాహ్ హిల్డెబ్రాండ్తో పసిడి ఫైట్ కాసేపట్లో ఉందనగా నిర్వాహకులు ఆమె బరువు కొలిచారు. అయితే.. 100 గ్రాముల అదనపు బరువు ఉండడంతో వినేశ్‌ను నిర్వాహకులు అనర్హురాలిగా ప్రకటించారు. దాంతో,ఫైనల్ ఆడలేకపోయిన ఆమె అప్పీల్‌పై అర్బిట్రేషన్ కోర్టు (సీఏఎస్) ను ఆశ్రయించింది. విశ్వ క్రీడల్లో విశేషంగా రాణించిన వినేశ్ ఫోగాట్‌కు గోల్డ్ మెడల్ ఇస్తామని హర్యానాకు చెందని ఖాప్ పంచాయతీ ప్రకటించింది.



# 79వేల దిగువకు సెన్సెక్స్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, మెటల్, ఆటో స్టాక్స్లో అమ్మకాలకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, ఎఫ్ఐఐల విక్రయాలు కూడా ఇందుకు తోడయ్యాయి. ముఖ్యంగా అధిక వెయిటేజీ కలిగిన హెచ్‌ఎఫ్సీ బ్యాంక్ 3.5 శాతం మేర నష్టపోవడం సూచీల పతనాన్ని శాసించింది. ఆ బ్యాంకు వెయిటేజీని రెండు దశల్లో పెంచుతామంటూ %మీాజ×% ప్రకటించడమే దీనికి కారణం. మార్కెట్ అంచనాలకు భిన్నంగా ఈ నిర్ణయం వెలువడమే సెంటిమెంట్ను దెబ్బతీసింది. దీనికితోడు ఎస్బిఐ, టాటా మోటార్స్, ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కూడా ప్రభావం చూపాయి. దీంతో సెన్సెక్స్ 79 వేల మార్కు దిగువన ముగిసింది.సెన్సెక్స్ ఉదయం 79,552.51 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,648.92) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపు లాభాల్లోకి వచ్చినా.. వెంటనే నష్టాల్లోకి జారుకుంది. రోజంతా అదే బాటలో పయనించింది. ఇంట్రాడేలో 78,889.38 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 692.89 పాయింట్ల నష్టంతో 78,956.03 వద్ద ముగిసింది. నిఫ్టీ 208 పాయింట్లు కోల్పోయి 24,139 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.99గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌ఎఫ్సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, టాటా స్టీల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్, హెచ్సీఎల్ టెక్నాలజీస్, నెస్లే ఇండియా, సన్ఫార్మా, రిలయన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82.20 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు 2,499 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.

## కొత్తగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

# ఆరు విమాన సర్వీసులు ప్రారంభం



**కోల్‌కతా:** టాటా సన్స్ అనుబంధ ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ దేశీయ విమాన ప్రయాణ నెట్‌వర్క్ బలోపేతం దిశగా అడుగులేస్తున్నది. కోల్‌కతా, చెన్నైలతోపాటు కొత్త రూట్లలో ఆరు రోజువారీ విమాన సర్వీసులు నడుపనున్నది. కోల్ కతా నుంచి రెండు, చెన్నై నుంచి మూడు, గువాహటి- జైపూర్ సెక్టార్ మధ్య ఒక విమాన సర్వీసు నడుపుతామని ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ మంగళవారం తెలిపింది. చెన్నై-భువనేశ్వర్, చెన్నై-బాగ్డొగ్రా, చెన్నై-తిరువనంతపురం, కోల్‌కతా- వారణాసి, కోల్‌కతా -గువాహటి, గువహాటి- జైపూర్‌లకు విమాన సర్వీసులు నడుపుతుంది.కోల్‌కతా - వారణాసి విమానం ఉదయం 7.40 గంటలకు టేకాఫ్ అవుతుంది. వారణాసికి 9.05 గంటలకు చేరుతుంది. తిరిగి 9.40 గంటలకు వారణాసిలో టేకాఫ్ అయి కోల్‌కతాకు 11.10 గంటలకు చేరుతుంది. కోల్‌కతా-గువాహటి విమాన సర్వీసు మధ్యాహ్నం 12.10 గంటలకు టేకాఫ్ అయి గువాహటికి 1.25 గంటలకు చేరుతుంది. తిరిగి గువాహటి నుంచి మధ్యాహ్నం 1.55 గంటలకు టేకాఫ్ అయి కోల్ కతాకు సాయంత్రం 4.35 గంటలకు చేరుతుంది.గువాహటి-జైపూర్ మధ్య ఎక్స్‌క్లూజివ్‌గా ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ కొత్త సర్వీసును ప్రారంభిస్తున్నది. చెన్నై - తిరువనంతపురం మధ్య వారంలో రెండు విమాన సర్వీసులు నిర్వహిస్తున్నప్పటికీ, డిమాండ్ పెరుగుతుండటంతో మరో సర్వీసు ప్రారంభిస్తోంది. ప్రస్తుతం ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ రోజువారీగా 82 విమానాలతో 380కి పైగా విమాన సర్వీసులు నిర్వహిస్తున్నది.

# ఏడాదికి రూ.2.5లక్షల ప్యాకేజీ

## కాగ్నిజెంట్ పై నెట్టింట ట్రోల్స్

**విశ్వంభర, బిజినెస్:** ప్రముఖ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్‌పై నెట్టింట ట్రోల్స్ వెల్లువెత్తుతున్నా యి. ఫ్రెషర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఇటీవల ఇచ్చిన జాబ్ పోస్టింగ్ వైరల్ గా మార డమే దీనికి కారణం. ఫ్రెషర్కు ఏడాదికి రూ.2.5 లక్షలు ఇస్తామని పేర్కొనడంతో సోషల్మీడియాలో ఆ సంస్థపై నెటిజన్లు దుమ్మెత్తి పోస్తున్నారు. 2024 గ్రాడ్యుయేట్ బ్యాచ్ ఫ్రెషర్ల నుంచి ఆఫ్ క్యాంపస్ రిక్రూట్మెంట్కు దరఖాస్తులు ఆహ్వానిం చింది. ఆగస్టు 14వ తేదీని దరఖాస్తుల సమర్పణకు తుది గడువుగా నిర్దేశించింది. దీనికి సంబంధించి ఇండియన్ టెక్ అండ్ ఇన్ఫ్రా అనే ఎక్స్ పేజీ ఈ జాబ్ వివరాలను పోస్ట్ చేయడం తో వైరల్ గా మారింది. ఆగస్టు 13న ఈ పోస్ట్ చేయగా దాదాపు 2 మిలియన్ల వ్యూస్ లభించా యి. దీంతో నెటిజన్లు తమదైన శైలిలో కామెం ట్లు చేయడం మొదలుపెట్టారు. 'ఏడాదికి రూ.2.52 లక్షలు అంటే.. నెలకు సుమారు రూ.20వేలు. ఓ పనిమనిషి ఒక్కో ఇంట్లో సగ టున 30 నిమిషాలు చొప్పున రోజుకు 8-10 ఇళ్లల్లో పనిచేస్తే ఇంతకంటే ఎక్కువ మొత్తం సంపాదిస్తుంది' అని ఓ యూజర్ పోస్ట్ చేశాడు. 'ట్యూషన్లు చెప్పినా ఇంతకంటే ఎక్కువ మొత్తం 'ఏడాదికి రూ.2.52 లక్షలు అంటే.. నెలకు సుమారు రూ.20వేలు. ఓ పనిమనిషి ఒక్కో ఇంట్లో సగటున 30 నిమిషాలు చొప్పున రోజుకు 8-10 ఇళ్లల్లో పనిచేస్తే ఇంతకంటే ఎక్కువ మొత్తం "సంపాదిస్తుంది' అని ఓ యూజర్ పోస్ట్ చేశాడు. 'ట్యూషన్లు చెప్పినా ఇంతకంటే ఎక్కువ మొత్తం వస్తుంది' అంటూ మరో యూజర్ రాసుకొచ్చాడు. 'వీధిలో తోపుడు బండ్ల వ్యాపారులే నయం.. ఇంకా ఎక్కువ ఆర్జిస్తారు' అంటూ మరో యూజర్ రాసుకొచ్చాడు. ఏడాదికి ఇచ్చే ఈ మొత్తంతో మెట్రో నగరాల్లో ఏం చేసుకోవాలి' అని మరో యూజర్ పోస్ట్ చేశాడు.




# ఎన్పీసీఐ నుంచి విడిపోయిన భీమ్..

## సీఈఓగా లలితా నటరాజ్..!

**ఢిల్లీ:** దేశీయంగా డిజిటల్ పేమెంట్స్ రోజురోజుకు పెరిగిపోతున్నాయి. డిజిటల్ పేమెంట్స్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) కీలక నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకూ తనకు అనుబంధంగా పని చేస్తున్న యూపీఐ బేస్డ్ పేమెంట్ ఆప్ 'భారత్ ఇంటర్ ఫేస్ ఫర్ మనీ భీమ్‌ను విడదీస్తున్నట్లు ఎన్పీసీఐ తెలిపింది. రోజురోజుకు డిజిటల్ లావాదేవీలకు పెరుగుతున్న డిమాండ్ కు అనుగుణంగా భీమ్' యాప్‌ను ప్రత్యేక అనుబంధ సంస్థగా ఏర్పాటు చేస్తున్నట్లు మంగళవారం వెల్లడించింది. భీమ్ యాప్‌కు ఎన్పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్‌గా పేరు పెట్టింది. ఈ భీమ్ యాప్ నిర్వహణ కోసం ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్ మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ లలితా నటరాజ్‌ను చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా నియమించింది. సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్‌గా రాహుల్ హండా వ్యవహరిస్తారు. ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంకు లో డిజిటల్ పార్టనర్ షిప్స్, డిజిటల్ అక్విజిషన్స్ అండ్ పేమెంట్స్ విభాగం అధిపతిగా లలితా నటరాజ్ సేవలందించారు. ఇక రాహుల్ హండా తొలుత ఓఎన్డీసీలో పని చేశారు. గత మార్చిలో భీమ్ బిజినెస్ అధిపతిగా ఎన్పీసీఐలో చేరారు. దేశీయ యూపీఐ ఎకో సిస్టమ్‌లో గూగుల్ పే, వాల్‌మార్ట్ బ్యాక్డ్ ఫోన్‌పేతోపాటు పేటీఎం సంస్థలు ఆధిపత్యం ప్రదర్శిస్తున్న వేళ.. 'భీమ్' యాప్ ను విడిగా ఒక సంస్థగా ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకున్నది. అయితే, కేవైసీ నిబంధనలను సరిగ్గా అమలు చేయకపోవడంతో ఆంక్షలు విధించడంతో ఇటీవల పేటీఎం మార్కెట్ వాటా పడిపోయింది. నేషనల్ పేమెంట్స్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ)లో ఎన్పీసీఐ భీమ్ సర్వీసెస్ సంస్థ మూడో ప్రధాన సంస్థ కానున్నది. భారత్ ఆవల యూపీఐ లావాదేవీల నిర్వహణకు నేషనల్ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్), దేశీయంగా బిల్లు చెల్లింపుల ఎకో సిస్టమ్ కోసం నేషనల్ భారత్ బిల్ పే లిమిటెడ్ (ఎన్బీబీఎల్) సంస్థలను ఎన్పీసీఎల్ నిర్వహిస్తోంది.




## 'కమిటీ కుర్రోళ్ళు'కు ప్రశంసలు

**విశ్వంభర, సినిమా :** కమిటీ కుర్రోళ్ళు చిత్రం విజయం సాధించడం పట్ల గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ సంతోషానికి అవధులు లేవు. తన సోదరి నిహారిక కొణిదెల సక్సెస్‌పై ఆయన ఆనందాన్ని మాటల రూపంలో వ్యక్తం చేశారు. నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ఈ సినిమాకు యదు వంశీ దర్శకుడు. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ఆగస్ట్ 9న వంశీ నందిపాటి విడుదల చేశారు. డిఫరెంట్ కంటెంట్‌తో ఇటు ఫ్యామిలీ ఆడియెన్స్, అటు యూత్‌ను ఆకట్టుకున్న ఈ చిత్రం మండే టెస్ట్ కూడా పాస్ అయ్యింది. నాలుగు రోజుల్లోనే రూ.7.48 కోట్లు వసూళ్లను సాధించి అన్నీ ఏరియాస్‌లో సినిమా బ్రేక్ ఈవెన్ సాధించటం విశేషం. దీనిపై రామ్ చరణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "నిహారిక 'కమిటీ కుర్రోళ్ళు' అద్భుతమైన విజయం సాధించినందుకు అభినందనలు. ఈ విజయానికి నువ్వు అర్హురాలివి. నీ టీమ్‌తో నువ్వు పడ్డ కష్టం, పనిలో చూపించిన నిబద్ధత స్ఫూర్తిని కలిగిస్తుంది. మీ టీమ్ చేసిన ప్రయత్నానికి హ్యాట్యాఫ్. ఈ కథకు జీవాన్ని పోసిన దర్శకుడు యదు వంశీకి ప్రత్యేకమైన అభినందనలు" అని పేర్కొన్నారు. మంచి పల్లెటూరి వాతావరణంలో స్నేహం, ప్రేమ, కుటుంబంలోని భావోద్వేగాలను 'కమిటీ కుర్రోళ్ళు' చిత్రంలో చక్కగా ఆవిష్కరించారు. సీనియర్ నటీనటులతో పాటు 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్స్‌ను తెలుగు సినిమాకు పరిచయం చేస్తూ మేకర్స్ చేసిన ఈ ప్రయత్నాన్ని అభినందిస్తూ ప్రేక్షకులు సినిమాను ఆదరించారని ట్రేడ్ వర్గాలంటున్నాయి. సినిమా బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిందని చిత్ర యూనిట్ తెలియజేసింది.

## తిరుమలలో అతిలోకసుందరి జయంతి



**విశ్వంభర, సినిమా :** దివంగత హీరోయిన్ అలనాటి నటి శ్రీదేవి పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఆమె కుటుంబసభ్యులు, అభిమానులు శ్రీదేవిని మరోసారి గుర్తుచేసుకుంటూ సోషల్ మీ డియా వేదికగా అతిలోక సుందరి జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే తన తల్లి పుట్టినరోజు సందర్భంగా ఆమె పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ తిరుమల శ్రీవారిని దర్శించు కున్నారు. మెట్ల దారి మీదుగా కొండపైకి చేరుకుని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. జాన్వీతోపాటు ఆమె ప్రియుడు శిఖర్ పహరియా కూడా ఉన్నారు. ప్రతీ ఏడాది తన తల్లి పుట్టిన రోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకుంటుంది జాన్వీ. ఇందుకు సంబంధించిన వీడియోస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అందులో జాన్వీ పసుపు రంగు పట్టు చీరలో అచ్చ తెలుగమ్మాయిలా సంప్రదాయంగా కనిపిస్తుంది. అలాగే ఆమె ప్రియుడు శిఖర్ పహారియా కూడా పంచెకట్టులో ట్రెడిష నల్ లుక్ లో కనిపించారు. శ్రీదేవి పుట్టినరోజు సందర్భంగా తన తల్లికి బర్త్ డే విషెస్ తెలుపుతూ జాన్వీ ఇన్ స్టాలో ఓ పోస్ట్ చేసింది. ఇందులో తల్లితో కలిసి ఉన్న చిన్నప్పటి ఫోటోతో పాటు మెట్లదారిలో తాను దిగి న ఓ ఫోటో లను కూడా పంచుకుంది. 'హ్యాపీ బర్త్ డే అమ్మా. ఐ లవ్యూ' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. తిరుపతి, తాను చీర కట్టినా కూడా తన తల్లికి చాలా ఇష్టమని జాన్వీ పలు సందర్భాల్లో చెప్పుకొచ్చింది. ఇదిలా ఉంటే.. ధడక్ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టిన జాన్వీ.. ఆ తర్వాత వైవిధ్యమైన పాత్రలు, విభిన్నమైన సినిమాలు ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. హిందీ సినిమాల్లో టాప్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన జాన్వీ.. ఇప్పుడు సౌత్ అడియన్స్ ముందుకు వస్తుంది. ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంలో నటిస్తుంది. త్వరలోనే ఈ మూవీ అడియన్స్ ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, సాంగ్స్ ఆకట్టుకున్నాయి. ఇవే కాకుండా రామ్ చరణ్ కొత్త సినిమాతోపాటు తమిళంలోనూ పలు ఆఫర్స్ అందుకుంటుంది జాన్వీ.

## నటుడిగా 65వ సంవత్సరంలోకి కమల్ హాసన్



విశ్వంభర, సినిమా : సినీ నటుడుగా విశ్వ నటుడు కమల్ హాసన్ 64 యేళ్ళు పూర్తి చేసుకుని 65 యేటలోకి అడుగుపెట్టారు. ఆయన బాల నట్నుగా నటించిన తొలి చిత్రం కలత్తూర్ కన్నమ్మ. ఈ చిత్రం విడుదలై 64 యేళ్ళు పూర్తి చేసుకుంది. కలత్తూర్ కన్నమ్మ సినిమాతో నటుడిగా ప్రస్థానాన్ని మొదలుపెట్టిన కమల్ హాసన్.. తొలి సినిమాతోనే జాతీయ స్థాయిలో ఉత్తమ బాలనటుడి అవార్డును అందుకున్నారు. బాలనటుడిగా శివాజీగణేశన్, ఎంజీఆర్, జెమినీ గణేషన్ లాంటి అగ్రనటులతో కలసి పనిచేశారు. యుక్తవయస్సుకు వచ్చాక సినిమాల్లో డాన్స్ డైరెక్టర్, ఫైటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత భాషాబేధం లేకుండా నటుడిగా వచ్చిన సినిమాలన్నీ చేశారు. 1974లో మలయాళంలో వచ్చిన కన్యాకుమారీ కమల్‌ను హీరోగా నిలబెట్టింది. తెలుగులో అంతులేని కథ, మరో చరిత్ర సినిమాలతో గుర్తింపు లభించింది. అనంతరం స్వాతి ముత్యం, సాగర సంగమం, ఇంద్రుడు చంద్రుడు వంటి సినిమాల్లో నటనకు మూడు నంది అవార్డులను అందుకున్నారు. హిందీలో కూడా ఏక్ దూజే కే లియే, గిరఫ్తార్, రాజ్ తిలక్ వంటి పలు సినిమాలతో నటించారు. జాతీయ స్థాయిలో మూడు సార్లు ఉత్తమ నటుడి అవార్డు అందుకున్నారు. భామనే సత్యభామనే సినిమాలో ఆడ వేషంలో కనిపించినా.. విచిత్ర సోదరులు సినిమాలో పొట్టివాడిగా నటించినా, కమల్ ఆయా పాత్రలో ఒదిగిపోయి అద్భుతమైన నటనను కనబరిచారు. దశావతారం సినిమాలో పది పాత్రలతో మెప్పించారు. కమర్షియల్ సినిమాల్లోనూ ప్రయోగాలు చేశారు. పూర్తి ప్రయోగాత్మక సినిమాలు చేసి మెప్పించారు. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వచ్చిన పుష్పక విమానం అలాంటిదే. మూకీ కమ్ స్లాప్ స్టిక్ కామెడీగా ఈ మూవీ అద్భుతమైన విజయాన్ని అందుకుంది.

## బాలీవుడ్ బాద్‌షాను వెనక్కి నెట్టిన శోభిత ధూళిపాళ్ల



**విశ్వంభర, సినిమా :** టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య, నటి శోభిత ధూళిపాళ్ల ఎంగేజ్‌మెంట్ గత గురువారం(ఆగస్టు 8) జరిగిన సంగతి తెలిసిందే. ఎటువంటి ముందస్తు ప్రకటన లేకుండా జరిగిన ఈ సడెన్ ఎంగేజ్‌మెంట్ తర్వాత శోభిత మరింత హాట్ టాపిక్‌గా మారింది. ఆమె గురించి చర్చలు కూడా ఎక్కువయ్యాయి. దీంతో ఈ వారం ఐఎండీబీ పాపులర్ ఇండియన్ సెలెబ్రిటీల లిస్ట్‌లో దూసుకెళ్లింది శోభిత ధూళిపాళ్ల. షారుక్‌ను బీట్ చేసి – ఈ లిస్ట్‌లో బాలీవుడ్ నటి శార్వరీ వాఘ్ అగ్ర స్థానంలో నిలిచింది. ముంజ్యా మూవీ సక్సెస్ తర్వాత శార్వరీ క్రేజ్ బాగా పెరిగింది. ఇక చైతన్యతో ఎంగేజ్‌మెంట్ తర్వాత శోభిత కూడా టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. దీంతో ఆమె ఈ పాపులర్ సెలబ్రిటీ జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. ఇక బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ మూడో స్థానంలో నిలిచారు. అలా షారుక్‌ను బీట్ చేసింది శోభిత.

### టాప్-10లో ఎవరెవరు..

ఈ జాబితాలో ఇంకా బాలీవుడ్ సీనియర్ నటి కాజోల్, యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. పారిస్ ఒలింపిక్స్‌లో మంచి ప్రదర్శన చేసిన బ్యాడ్మింటన్ ప్లేయర్ లక్ష్యసేన్, బాలీవుట్ నటి దీపికా పదుకొణె, మహారాజతో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకున్న విజయ్ సేతుపతి, హీరోయిన్ మృణాల్ ఠాకూర్, ఐశ్వర్య రాయ్ ఈ టాప్-10లో చోటు సంపాదించుకున్నారు. శోభిత ధూళిపాళ్ల విషయానికొస్తే చివరిగా ఆమె మంకీ మ్యాన్ చిత్రంలో నటించింది. అలానే డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్న ది నైట్ మేనేజర్‌లోనూ కనిపించింది. ఈ రెండు ప్రాజెక్ట్‌లు మంచి రెస్పాన్సే అందుకున్నాయి. ప్రస్తుతం సితార అనే బాలీవుడ్ సినిమాలో నటిస్తోంది. త్వరలోనే తన కొత్త ప్రాజెక్ట్‌లను కూడా అనౌన్స్ చేయనుంది. ఇక నాగ చైతన్య ప్రస్తుతం చందూ మొండేటీ దర్శకత్వంలో తండేల్ సినిమా చేస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇందులో సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది.

## అనాస పువ్వుతో ఎన్నో లాభాలు



**విశ్వంభర, ఫీచర్ :** బిర్యానీలు, మాంసాహార వంటకాల్లో కమ్మదనం కోసం మనం చెక్క, లవంగం, బిర్యానీ ఆకు, అనాస పువ్వు లాంటి సుగంధ ద్రవ్యాలు వాడుతాం. వాటిలో అనాస పువ్వు అన్నింటికంటే మేలైనది. దీనివల్ల ఆహారానికి కమ్మటి వాసన వస్తుంది. ఈ అనాస పువ్వు చూడటానికి చక్రంలాగా ఉంటుంది. అందుకే దీన్ని చక్ర ఫూల్ అని కూడా అంటారు. వంటల్లో వాడే ఈ అనాస పువ్వువల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. మరి ఆ ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం..

### జీర్ణశక్తి

బిర్యానీ, బగారా, మాంసం లాంటి వంటల్లో అనాస పువ్వును కచ్చితంగా ఉపయోగించడానికి కారణం అది జీర్ణశక్తిని పెంచడమే. ఈ పువ్వులోని అనెథోల్ సమ్మేళనాలు జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. ఉబ్బరం, అజీర్తి లక్షణాలను తగ్గించడంలో సాయపడతాయి.

### రోగ నిరోధకత

అనాస పువ్వులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్ ఉంటాయి. ఈ సమ్మేళనాలు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడంలో సాయపడతాయి. తద్వారా రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దీన్ని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల ఇన్‌ఫెక్షన్లు, అనారోగ్యాలకు వ్యతిరేకంగా శరీరంలో రక్షణ వ్యవస్థ బలోపేతమవుతుంది.

### శ్వాస సంబంధ సమస్యలు

సాంప్రదాయ చైనీస్ వైద్యంలో దగ్గు, జలుబు, ఉబ్బసం వంటి శ్వాసకోశ సంబంధ వ్యాధులను తగ్గించడానికి అనాస పువ్వును గత కొన్ని శతాబ్దాలుగా వాడుతున్నారు. దీనిలోని ఔషధ లక్షణాలు శ్వాసకోశాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో తోడ్పడుతాయి.

### యాంటీ మైక్రోబయల్

అనాస పువ్వులో వివిధ వ్యాధులకు కారణమయ్యే సూక్ష్మజీవులను నాశనం చేయడానికి యాంటీ మైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి బ్యాక్టీరియా, శిలీంధ్రాలకు వ్యతిరేకంగా పనిచేస్తాయి. దాంతో బ్యాక్టీరియల్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌లు, చర్మ వ్యాధులు కూడా నయమవుతాయి.

### హార్మోనల్ బ్యాలెన్స్

సాంప్రదాయ ఔషధాల తయారీలో కూడా అనాస పువ్వును ఉపయోగిస్తారు. ముఖ్యంగా మహిళల్లో హార్మోన్లు సమతుల్యంగా ఉండటంలో ఇది సాయపడుతుంది. ఇది శరీరంలో ఈస్ట్రోజెన్ చర్యను అనుకరించే ఫైటో ఈస్ట్రోజెన్లు, మొక్కల సమ్మేళనాలను కలిగి ఉంటుంది. ఇవి నెలసరి సమస్యల పరిష్కారంలో తోడ్పడుతాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com